ప్రజాశక్తి

శనివారం 4 మే 2024 పేజీలు 8



విజయనగరం



పార్వతీపురం మన్యం

వనరులు దోచుకుని ఉచితాలా?



పెదపెంకిలో సిపిఎం నాయకులకు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళ

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి ● ఎన్నికల ప్రచారంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

నిధులు, భూములు, వనరులను దోచుకొని పప్పు బెల్లంలా వైసిపి, టిడిపి ఉచిత పథకాలు ప్రకటిస్తున్నాయని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు కావాలంటే బిజెపిని, దాని పొత్తు, మద్దతుపార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పి.అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ శుక్రవారం బలిజిపేట మండలం పెదపెంకిలో ప్రచారం నిర్వహించారు. గ్రామంలో సిపిఎం కార్యకర్తలు, నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నాట్యమండలి ఆధ్వర్యంలో డప్పుల దరువులు, కొలాటంతో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలంటూ నినదించారు. ర్యాలీ సందర్భంగా నాయకులకు మహిళలు స్వాగతం పలికి హారతు లిచ్చారు. అనంతరం రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడారు. పోలవరం కడుతున్న కాంట్రాక్టు కంపెనీ వద్ద ఎన్నికల బాండ్ల పేరిట రూ.1000కోట్లు తీసుకున్నారని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు కావాలంటే బిజెపి గద్దె దిగాలని పిలుపునిచ్చారు. పెద్దపెంకిలో ప్రతి 10మందికీ ఒక ఫైలేరియా కేసు ఉందని, అయినా స్థానిక ఎంఎల్ఎ పట్టించుకోలేదని అన్నారు. బాధితులందరికీ పింఛన్లు కూడా ఇవ్వలేదన్నారు. ఈ మండలంలో ఉన్న పెదంకలాం ప్రాజెక్ట్ కి వచ్చిన రూ.18కోట్లు ఎవరు తినేశారో ప్రజలు ఆలోచించాలన్నారు. ధాన్యం కొనుగోలులో విపరీతమైన దోపిడీ చేస్తున్నారని అన్నారు. సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ ఇప్పటికే మోడీ భారాలు భారాలు మోయలేక జనాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని,. హత్యలు, అత్యాచారాలు, అప్రజాస్వామిక చర్యలను ప్రజల భరించలేక పోతున్నారని అన్నారు. మరోసారి అధికారంలోకి వస్తే ఇంకెన్ని భారాలు మోపుతారో? అని ప్రశ్నించారు. వామపక్షాల ఒత్తిడితో యుపిఎ -1 ప్రభుత్వయి తెచ్చిన జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేశారని తెలిపారు. పనిభారం తప్ప కష్టానికి తగ్గ ఫలితం లేదన్నారు. జగన్, బాబు ఇద్దరూ కేసులనుంచి తప్పించుకోవడానికి బిజెపితో పొత్తు, తొత్తు కుదుర్చుకున్నారని అన్నారు. బ్యాంక్‌లను మోసం చేసిన కొత్తపల్లి గీత జనాన్ని మోసం చేయడాదన్నా గ్యారెంటీ లేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బి.మోహనరావు మాట్లాడుతూ మోడీ కార్పొరేట్ వ్యవస్థకు తప్ప పేదల కోసం పనిచేయడం లేదన్నారు. బాబు,జగన్, పవన్ తో రాష్ట్రంలో మోడీ జగన్నాటకం ఆడుతున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ఎన్నో సంక్షేమ, అభివద్ధి పథకాలు అమలుచేసిందని తెలిపారు. ఇండియా వేదిక మద్దతుతో పోటీచేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు, కార్యదర్శివర్గ సభ్యులు వై.మన్మధ రావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పలగర గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు వంజరాపు సత్యంనాయుడును పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ, జిల్లా కార్యదర్శి రెడ్డివేణు పరామర్శిచారు.



రెడ్డివానివలసలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం శ్రేణులు



శ్రీరామ్మూర్తి వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు సుబ్బరావమ్మ

ఉద్యమాలకు పునాది శ్రీరామ్మూర్తి

దోపిడీ శక్తులను ఓడించడమే ఆయనకు నివాళి ● వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/సీతానగరం

భవిష్యత్ పోరాటాల పునాది రెడ్డి శ్రీ రామ్మూర్తి అని పలువురు వక్తలు కొనియాడారు. దోపిడీ శక్తులను ఓడించడమే ఆయనకు ఇచ్చిన నివాళి అని అన్నారు. సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా తొలి కార్యదర్శి కీర్తిశేషులు శ్రీరామ్మూర్తి మూడవ వర్ధంతి సభ ఆయన స్వగ్రామం సీతానగరం మండలం రెడ్డివాని వలసలో శుక్రవారం జరిగింది. ఈ సభకు రెడ్డివానివలస, అంటిపేట, అప్పయ్యపేట, రామవరం, చినభోగిలి, బుడ్డిపేట, లక్సీమీపురం సహా మండలంలోని అన్ని గ్రామాల నుంచి జనం హాజరయ్యారు. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, కార్యదర్శి వర్గ సభ్యులు కె. సుబ్బరావమ్మ, పార్టీ సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి ముఖ్య వక్తలుగా వచ్చారు. తొలుత శ్రీరామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి ఆశయ సాధనతోనే పార్వతీపురం జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని అన్నారు. అందుకనుగుణంగా కార్యకర్తలంతా ప్రజలతో మమేకం కావాలన్నారు. శ్రీరామ్మూర్తి దోపిడీ శక్తులను ఎదురించారని, ఇప్పుడు బిజెపి, టిడిపి, వైసిపిలను ఓడించడమే తనకిచ్చిన నివాళి అని అన్నారు. సబ్బరావమ్మ మాట్లాడుతూ టిడిపి, వైసిపిల్లో ఎవరికి ఓట్లేసినా బిజెపికికి ఓటేసినట్టేనని అన్నారు. ఎం.కృష్ణమూర్తి మాట్లడుతూ రెడ్డి శ్రీరామ్మూర్తి ఓ వైపు పార్టీ అభివృద్ధికి పాటుపడుతూనే అనేక ప్రజాతంత్ర ఉద్యమాలు నిర్వహించారని అన్నారు. ముఖ్యంగా పార్వతీపురం జిల్లా పునర్నిర్మాణానికి ఎంతో కృషి (మిగతా..3లో)

రైతులను మోసగించిన జగన్

కొత్తవలస సభలో సినీనటుడు బాలకృష్ణ

ప్రజాశక్తి- కొత్తవలస

నమ్మి ఓట్లేసి గెలిపించిన రైతులను సిఎం జగన్ నిలువునా మోసగించారని సినీనటుడు, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నందమూరి బాలకృష్ణ ఆరోపించారు. కొత్తవలస మండలంలో శుక్రవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఆయనను స్థానిక నాయకులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని పిచ్చివాడు పరిపాలిస్తున్నాడని ధ్వజమెత్తారు. బాబాయ్‌ని చంపి, చెల్లిని పక్కన పెట్టిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందని ఆక్షేపించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై బాలకృష్ణ.. సిఎం జగన్‌కు ప్రశ్నలు సంధించారు. 'ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దానికి సమాధానం చెప్పడానికి సిద్ధమా?. జాబ్ కేలండర్ విడుదల చేయకుండా తాత్సారం చేస్తున్నారు. కల్తీ మద్యంతో కొన్ని లక్షల తాళిబొట్లు తెగిపడుతున్నాయి. దానికి సమాధానం చెప్పడానికి సిద్ధమా?. చివరికి చెత్త మీద పన్ను వేశావ్.. దానికి సమాధానం చెప్పడానికి సిద్ధమా?' అంటూ సవాల్ చేశారు. దుర్మార్గమైన పాలనను ఓటు అనే పోటుతో మట్టి కరిపించాలని ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. అంబేద్కర్ విదేశీ విద్య పేరు మార్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే సొంతమని ధ్వజమెత్తారు. 'ఒక్క అవకాశం..' అంటూ వచ్చి కోడి కత్తి, బాబాయ్ హత్య ఘటనలతో గద్దెనెక్కారని, ఇప్పుడు గుళకరాయితో సానుభూతి పొందాలని చూస్తున్నారని తీవ్ర విమర్శలు గుప్పించారు. సినిమా డైలాగ్‌లతో అభిమానులను ఉర్రూతలూగించారు. తొలుత టిడిపి విశాఖ ఎమ్‌పి అభ్యర్థి శ్రీభరత్, శృంగవరపుకోట ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, నాయకులు ఇందుకూరి సుధారాణి, జనసేన నాయకులు ఒబ్బిన నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న సినీనటుడు బాలకృష్ణ

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుర్బుద్ధితోనే దుష్ప్రచారం

విద్యారంగంపై బాలకృష్ణ చర్చకు సిద్ధమా? : మంతి బొత్స

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కేంద్ర ప్రభుత్వ సూచనతో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై దుర్బుద్ధితోనే చంద్రబాబు ఎన్నికల వేళ దుష్ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం విజయ నగరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తుల రక్షణ కోసం ఈ చట్టాన్ని పకడ్బందీగా రూపొందిస్తున్నామని చెప్పారు. ఈచట్టాన్ని ఇంకా అమలు చేయలేదని, ఈ అంశం కోర్టులో పరిధిలో ఉందన్నారు. ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన రీతిలోనే ఈ చట్టాన్ని అమలు చేస్తామన్నారు. కానీ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ప్రజలను గందరగోళ పరిచేందుకు చంద్రబాబునాయుడు అనసర రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. ఎన్నికలు కాబట్టి ఏది మాట్లాడితే అది చెల్లిపోతుందని, లేదంటే క్రిమినల్ కేసులు పెట్టాల్సి ఉంటుంది అని అన్నారు. తాజాగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో భూరిజిస్ట్రేషన్ ఒరిజినల్ పత్రాలు ఉంచుకొని, లబ్ధిదారులకు (మిగతా..3లో)



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సంక్షేమాన్ని విస్మరించిన వైసిపి, టిడిపి

ప్రజాశక్తి-తెర్లాం

ప్రజా సంక్షేమాన్ని వైసిపి, టిడిపి విస్మరించాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మరిపి విద్యాసాగర్ విమర్శించారు. తెర్లాం మండలంలోని చిన్నయ్యపేట, లింగాపురం, అంట్లవార, నందిగాం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బిజెపి, వైసిపి ప్రభుత్వాల వైఫల్యాలను, కాంగ్రెసు మేనిఫెస్టోను ప్రజలకు వివరించి ఓట్లను అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి చేసి సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందిస్తామని చెప్పారు. ప్రచారంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ముప్పల శ్రీనివాసరావు, నాయకులు పి.రవీంద్ర, ఆర్.అప్పలనాయుడు, పి.రాజు, ఆర్.రామారావు, జగదీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. శుక్రవారం పట్టణంలోని బల్లవీధి, చీపురుపల్లివీధి, వెలమవారివీధి, తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితేనే ఆరోగ్యంగా ఉండగలమని చెప్పారు. చెత్త బయట వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. చెత్త రోడ్లు, కాలువల్లో వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఖాళీ పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. స్థానిక గంటి ప్రసాదం భవనంలో శుక్రవారం ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒమ్మి రమణ జెండాను ఎగురవేశారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న, బొబ్బిలి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మహేష్, ఇ.చిన్ను, ఎస్.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



రాజీనామా పత్రాలను కార్యదర్శికి అందిస్తున్న వాలంటీర్లు

15 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-లక్కవరపుకోట

మండలంలోని గొల్జాం గ్రామానికి చెందిన 15 మంది వాలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు అందజేశారు. సిఎం జగన్‌కు మద్దతుగా ఎన్నిక ప్రచారంలో పాల్గొనేందుకు వీలుగా తామంతా రాజీనామా చేస్తున్నట్లు వాలంటీర్లు ప్రకటించారు.

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి : జెడ్‌పి ఛైర్మన్

ప్రజాశక్తి - చీపురుపల్లి

మీ కష్టసుఖాల్లో నిరంతరం మీ మధ్యే ఉంటాం.. నాన్నగారిని ఆదరించి ఓటేయండి అంటూ రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యన్నారాయణ తనయుడు బొత్స సందీప్ నాయుడు ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చీపురుపల్లి పట్టణంలో ఉన్న ప్రతీ షాపునకు, ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్లను కోరారు. బొత్స సత్యన్నారాయణ మంత్రి అయిన తరవాత చీపురుపల్లికి సాగు, తాగు నీటితో పాటు విద్యా పరంగా డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల వంటివి తీసుకొచ్చారని అన్నారు. ఈ దపా అవకాశం ఇస్తే చీపురుపల్లిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, కాపుకార్పోరేషన్ డైరెక్టర్ బెవర ఉమాకుమారి, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఎంపిటిసి ఇప్పిలి సుదారాణి, వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, మాజీ జెడ్‌పిటిసి మీసాల వరహాలనాయుడు,



చీపురుపల్లి: ప్రచారంలో పాల్గొన్న బొత్స సందీప్

కనకమహలక్ష్మి అమ్మవారి ఆలయ కమిటీ ఛైర్మన్ వైస్ ఛైర్మన్‌లు ఇప్పిలి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : వైసిపితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. భోగాపురంలో శుక్రవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోసారి గెలిపిస్తే గ్రామాలన్ని అభివృద్ధి జరుగుతాయని చెప్పారు. నెల్లిమర్ల నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బడుకొండ అప్పలనాయుడు, ఎంపి అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. అంతకు ముందు మండలంలోని రామచంద్రపేట, కొండరాజుపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎంపి బెల్లాన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అప్పలనాయుడు మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాల్లో తాగునీరు రహదారి సౌకర్యంతో పాటు మరిన్ని అభివృద్ధి పనులకు తాము శ్రీకారం చుడతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కందుల రఘుబాబు, వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఉప్పాడ శివారెడ్డి, బడ్డుకొండ ప్రదీప్, మణిదీప్, పడాల శ్రీనివాసరావు, భాను, కొమ్మూరి శుభోషణరావు, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, యర్రప్పల నారాయణ, రమేష్ రాజు, సుందర హరీష్, కర్రోతు వెంకటరమణ, పతివాడ రామకృష్ణ , దుక్క రమణ, అప్పన్న, సుగ్గు రాము, ఎరుపల్లి పెద్దయ్య, రేయుడు, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: వైసిపి ప్రభుత్వంతోనే గ్రామాలాభివృద్ధి చెందాయని మరోసారి వైసిపికి అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తారని ఎంపిపి బంటుపల్లి వెంకట



భోగాపురం : ర్యాలీ చేస్తున్న వైసిపి నాయకులు

వాసుదేవరావు, ఎమ్మెల్యే తనయుడు బడ్డుకొండ మణిదీప్ నాయుడు అన్నారు. మండలంలో బంటుపల్లి, వెదుళ్ళ వలస, గొడ్డి పాలెం, ఆకులపేట గ్రామాల్లో ఇంటింట ప్రచార నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వస్తేనే గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తాయన్నారు. ఎమ్మెల్యేగా బడ్డుకొండ అప్పలనాయుడును, ఎమ్‌పిగా బెల్లాన చంద్రశేఖర్‌ను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు కూరాకుల అనిత, పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచులు కలి శెట్టి రామకృష్ణ చిక్కాల జనార్దన్ రావు, సువ్వాడ రమేష్, బాలాజీ పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని చీడివలస, రామలింగాపురం, దేవాడ, ముసిరం, వియ్యంపేట, నీలభద్రపురం గ్రామాల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తనను మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పది రోజులు విశ్రమించొద్దు

శృంగవరపుకోట: పోలింగ్ బూత్ స్థాయిలో అందరూ ఏకమై, ఈ పది రోజులు విశ్రమించకుండా పనిచేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం పట్టణంలోని సిరికి రిసార్ట్‌లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన బూత్ స్థాయి కార్యకర్తలు, కన్వీనర్ల సదస్సులో ఆయన మాట్లాడారు. శృంగవరపుకోటలో గెలిచిన పార్టీనే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరాంధ్ర మొత్తం క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తంచేశారు. వాలంటీర్లు అందరూ రిజైన్ చేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని సూచించారు. మళ్లీ ఎన్నికలయ్యాక వాలంటీర్లు అందరినీ యథాతథంగా నియమిస్తామని హామీనిచ్చారు. బూత్ స్థాయి కార్యకర్తలు, కన్వీనర్లే ఎన్నికల సమరంలో కీలకమని చెప్పారు. ప్రతి ఓటు మనకు కీలకం, పథకాల లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ మనల్ని ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు, వాలంటీర్లు.. అందరూ సమన్వయంతో ఓటరు జాబితాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఎన్నికల కోసం సిద్ధం కావాలని సూచించారు. మేనిఫెస్టోలో ఉన్న ప్రతి అంశాన్ని తప్పక నెరవేరుస్తామని చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సతీమణి డాక్టర్ మధు, నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్ కుమార్,



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

కొప్పలవెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడుబాబు, జిసిసి ఛైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, డిసిసిబి ఛైర్మన్ వేచలపు చినరామునాయుడు, ఎఎంసి ఛైర్‌పర్సన్ మూకల కస్తూరి, ఎంపిపిలు గేదెల శ్రీనివాసరావు, నీలంశెట్టి గోపమ్మ, దొగ్గ సత్యవంతుడు, జెడ్‌పిటిసిలు తూర్పాటి వరలక్ష్మి, గొర్లె సరయు, నెక్కల శ్రీదేవి, సేనాపతి అప్పారావు, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, గుమ్మడి సత్యనారాయణ, మమ్ములూరి జగన్నాథం, మోపాడ కుమార్, గొర్లె రవికుమార్, పంచాయతీరాజ్ జోనల్ ఛైర్మన్ ఎం.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తేడాలొస్తే ఉపేక్షించం

రేగిడి: ఉపాధి వేతనదారుల మస్టర్లలో తేడాలు వస్తే ఉపేక్షించేది లేదని ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ అన్నారు. శుక్రవారం కొర్లవలస పంచాయతీ ముల్లువాని చెరువు పనులను ఆయన పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు. వేతనదారులతో మాట్లాడుతూ మెట్టు పొలం ఉన్న సన్న, చిన్నకారు రైతులకు పండ్ల తోటలు వేసుకోవ డానికి అవకాశం ఉందని, తోటలు ఉన్న రైతు లకు కందకాలు, చెట్టు చుట్టూ ట్రెంచ్‌లు తవ్వుకో వడానికి అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్ర మంలో ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత, మెట్లు, వేతనదారులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ప్రారంభం

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని హెచ్ఎం బి.ఉమా మహేశ్వరరావు ప్రారంభించారు. 7 నుంచి 15 ఏళ్ల బాలబాలికలకు శిక్షణ ఇస్తున్నారు. కోచ్‌లుగా వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్.కృష్ణ, పి.మౌనిక, పి.శ్రీరాములు వ్యవహరిస్తున్నారు.

బేబినాయన గెలుపుతో ప్రజలకు న్యాయం

ప్రజాశక్తి- బొబ్బిలి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయనకు మద్దతుగా జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర కార్యదర్శి బాబు పాలూరి ఆధ్వర్యాన శుక్రవారం పట్టణంలో సైకిల్‌ర్యాలీ చేపట్టారు. వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ప్రారంభించి, 5, 7, 8, 9 వార్డుల్లో ర్యాలీ కొనసాగింది. బేబినాయన గెలుపునకు జనసైనికులు పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి కోరారు. జనసేన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరంతరం ప్రజల కోసం పని చేస్తున్న బేబినాయనను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు లంక రమేష్, నాగు, జనసైనికులు పాల్గొన్నారు.

రామభద్రపురం: ఆంధ్రప్రదేశ్ అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయం సాధించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలూరి బాబు, టిడిపి జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు కర్రోతు తిరుపతిరావులు అన్నారు. మండల కేంద్రంలో వారు శు



బొబ్బిలి: సైకిల్ ర్యాలీ చేస్తున్న జనసేన నాయకులు

క్రవారం విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుకబడి పోయిందన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సరైన నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బొబ్బిలి అసెంబ్లీ అభ్యర్థి బేబీనాయన, ఎమ్‌పి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడులకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వైసిపి మాటలు నమ్మొద్దు : మాధవి

ప్రజాశక్తి - నెల్లిమర్ల/డెంకాడ

వైసిపి మాటలు నమ్మవద్దని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి అన్నారు. డెంకాడ మండలంలో జొన్నాడ, బొడ్డ వలస, ఆకులపేట గ్రామాల్లో శుక్రవారం టిడిపి నాయకులతో కలిసి ఆమె ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకసారి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే నియోజవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తానన్నారు. యువతకి ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. వైసిపి ఈ ఐదేళ్లలో చేయలేనవన్నీ మరోసారి అవకాశమిస్తే చేస్తానంటే ప్రజలు ఎలా నమ్ముతారన్నారు. ప్రతి ఒక్కరూ గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పల నారాయణ తదితరులు



డెంకాడ: ప్రజలకు అభివాదం చేస్తున్న మాధవి

పాల్గొన్నారు.

ఎన్‌డిఎతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్ కోరారు. నెల్లిమర్ల మండలం కొత్తపేట, సీతారామునిపేట పంచాయ తీల్లో కూటమి అసెంబ్లీ అభ్యర్థి లోకం నాగ మాధవి, టిడిపి ఎమ్‌పి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడుని గెలిపించాలని కోరు తూ ప్రచారం చేశారు. ఈ సంద ర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని రంగాలూ నిర్వీర్యమై అభివృద్ధి లేకుండా పోయాయ న్నారు. తిరిగి రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఎన్‌డిఎ కూటమిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, కొత్తపేట మాజీ సర్పంచ్ గురాన ఆసిరినాయుడు, రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, మండల ప్రధాన కార్యదర్శి గురాన చక్రధర్, జిల్లా తెలుగు రైతు అధికార ప్రతినిధి తాడ్డి సత్యనారాయణ, మండల తెలుగు యువత అధ్యక్షులు నల్లం శ్రీను, సీతారామునిపేట నాయకులు గొర్లె శ్రీనివాస్, దన్నాన శ్రీరామ్, జనసేన నాయకులు కరుమజ్జి గోవింద, సువ్వాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనతో సరి

- అమలుకు నోచుకోని ఫ్లోటింగ్ జెట్టీ
- మత్స్యకారుల ఆశలపై నీళ్లు
- ఏడాది క్రితం శిలాఫలకం ఆవిష్కరించిన సిఎం జగన్

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

మత్స్యకారుల జీవితాల్లో మార్పులు తీసుకొస్తామని చెప్పిన నాటి టిడిపి ప్రభుత్వం ఆచరణలో మాట నిలబెట్టుకోలేదు. చింతపల్లి తీరంలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మించి ఉద్ధరిస్తామన్న వైసిపి ప్రభుత్వం కేవలం శంకుస్థాపనకు పరిమితమైంది. దీంతో, మత్స్యకారుల జీవితాలు ఎదుగు బోదుగూ లేకుండా పోతున్నాయి. జిల్లాలో సుమారు 21.44 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. సుమారు 4వేల మత్స్యకార కుటుంబాల్లో 20వేల జనాభా సముద్రంలో చేపలవేటే జీవనాధారంగా కాలం వెల్లదీస్తున్నాయి. జిల్లాలో గుర్తించిన 711 మోటరైజ్‌డ్ ఫిషింగ్ బోట్లు, 417 సంప్రదాయ పడవలు ఉన్నాయి. ఒక్క చింతపల్లి ప్రాంతంలోనే 487 మోటరైజ్‌డ్ ఫిషింగ్ క్రాఫ్ట్, 361 సంప్రదాయ పిషింగ్ బోట్లు ఉన్నాయి. చింతపల్లితో పాటు చుట్టుపక్కల ప్రాంతంలోని తిప్పలవలస, మద్దూరు,



చింతపల్లి తీరంలో జెట్టీని నిర్మించాల్సింది ఇక్కడే

కొత్తూరు, బర్రిపేట, నీలగెడ్డపేట, తమ్మయ్యపాలెం, పులిగెడ్డపాలెం, పతివాడ బర్రిపేట తదితర చోట్ల 16 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఉన్నాయి. సముద్ర తీరం నుంచి కెరటాలను దాటుకొని సముద్రంలోకి ప్రవేశించడం అత్యంత ప్రమాదకరమైన ప్రక్రియ. ఈ సమయం లోనే ఎక్కువమంది మత్స్యకారులు ప్రమాద వశాత్తూ ప్రాణాలు కోల్పోతుంటారు. దీనికి భయపడి చాలామంది మత్స్యకారులు తమ వృత్తిని వదిలిపెట్టడం లేదా, జెట్టీ ఉన్న ప్రాంతానికి వలస వెళ్లిపోవడం జరుగుతోంది. విజయనగరం జిల్లాలో చేపలవేటలో అత్యంత నైపుణ్యం ఉన్న మత్స్యకారులు ఉన్నారు. వీరి నైపుణ్యానికి గొప్ప గుర్తింపు ఉంది. దేశంలో ఏ రాష్ట్రంలోకి వెళ్లినా, విజయనగరం జిల్లాకు చెందిన మత్స్యకారులు కనిపిస్తారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో పనిచేస్తున్న బోటు డ్రైవర్లలో సగం మంది విజయనగరం జిల్లాకు చెందినవారే కావడం గమనార్హం. ఈ సమస్య పరిష్కరించి మత్స్యకారులకు జరుగుతున్న నష్టాన్ని అరికట్టడంతోపాటు మత్స్య సంపద విక్రయించుకునేందుకు అవకాశం కల్పించాలని చాలా కాలంగా డిమాండ్ ఉంది. గతపాలకులు విస్మరించిన నేపథ్యంలో తాము పూసపాటిరేగ మండలం చింతపల్లి తీరంలో సుమారు రూ.23.73కోట్ల అంచనాతో ఫ్లోటింగ్ జట్టీ నిర్మాణం చేపడతామని వైసిపి ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం చింతపల్లి తీరంలో 6వేల ఎకరాలు కేటాయించారు. సరిగ్గా ఏడాది క్రితం 2023మే 3న సిఎం జగన్మోహన్‌రెడ్డి ఫ్లోటింగ్ జట్టీ నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. రాష్ట్రంలో పూడిమడక తరువాత, చింతపల్లే రెండోపెద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌గా ఉంటుందని, ఇక్కడ జెట్టీ నిర్మాణం వల్ల మత్స్యకారులు నిర్భయంగా సముద్రంలోకి వెళ్లే అవకాశం లభిస్తుందని, రాత్రీ పగలూ చేపల వేటకు వెళ్లొచ్చని, మత్స్యకారులు తాము వేటాడిన చేపలను సులువుగా ఒడ్డుకు చేర్చడానికి వీలు అవుతుందని, అప్పట్లో సిఎం జగన్‌తోపాటు వైసిపి నాయకులు కూడా అప్పట్లో తెగేసి ఊదరగొట్టారు. మేలైన మత్స్య ఉత్పత్తిచేయడానికి, జెట్టీతో మత్స్యకారుల పడవలకు రక్షణ లభిస్తుం దని, లంగరు వేసుకోవడం సులువుతుం దని కూడా చెప్పారు. చింతపల్లిలో జెట్టీ నిర్మాణం జరిగితే, పర్యాటక పరంగా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుని కూడా జనం ఆశించారు. ఈ జెట్టీ నిర్మాణం పూర్తయితే మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెరగడమే కాకుండా, నాణ్యమైన మత్స్య ఉత్పత్తులు జిల్లా ప్రజలకు అందుబాటు లోకి వస్తాయి. పర్యాటక పరంగా కూడా చింతపల్లి ప్రాంతం అభివద్ధి చెందుతుం దన్న ఆశాభావం మత్స్యకారుల్లో వ్యక్తమైంది. ఆచరణలో మాట నిలబెట్టుకోకపోవడంతో మత్స్యకారుల పరిస్థితి ఎప్పటిలానే మిగిలింది. దీంతో, టిడిపి మాదిరిగా వైసిపి ప్రభుత్వం కూడా ఆశపెట్టి మోసం చేసిందని జనం చర్చించు కుంటున్నారు.

తీరం వైపు కన్నెత్తి కూడా చూడలేదు

ఫ్లోటింగ్ జెట్టీ కడతామని చెప్పి సిఎం జగన్మోహన్ రెడ్డి ద్వారా ఆర్భాటంగా ప్రారంభోత్సవం చేసి వదిలేసారు. ఇప్పటికి వరకూ అధికారులు గాని, నాయకులు గాని తీరం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఫ్లోటింగ్ జెట్టి వస్తే మా మా బతుకులు బాగుపడతాయని అనుకున్నాం. ఇప్పటికొచ్చి ఒక్క రాయి కూడా వేయలేదు. కడతారని నమ్మకం కూడా లేదు.

కొమర ఎల్లయ్య
మత్స్యకారుడు, చింతపల్లి.

మా ఓట్లే కావాలి

ఈ ప్రభుత్వానికైనా, గత ప్రభుత్వానికైనా మా ఓట్లే కావాలి తప్ప మా బతుకులు బాగుపడేలా చేసే నాయకుడు ఒక్కడు కూడా లేడు. భోగాపురం, పూసపాటిరేగ తీరంలో 10వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా వేట పై ఆధారపడిన వారు ఉన్నారు. జెట్టీ వస్తే మా అందరికీ ఉపయోగపడుతుంది. జెట్టీ లేక మా వేటకారులంతా వలస వెళ్లిపోతున్నారు. ఈ ఐదేళ్లు అక్కడ కడతాం ఇక్కడ కడతామని నాన్చేసారు. జెట్టి సకాలంలో పూర్తి చేస్తామన్న నాయకుడి వైపే మా మత్స్యకారులు ఉంటారు.

బర్రి పోలయ్య
తిప్పలవలస, పూసపాటిరేగ మండలం.

సంక్షేమ పథకాలు అందాలంటే జగన్ సిఎం కావాలి : కడుబండి

ప్రజాశక్తి-కొత్తవలస

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందరికీ చేరాలంటే మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని స్థానిక ఎమ్మెల్యే కలువండి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలో చిడివలస, రామలింగాపురం, దేవాడ, ముసిరం, వియ్యంపేట, వీరభద్రపురం పంచాయతీలలో ఎన్నికల ప్రకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను, ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎపంపి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, మండలపార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, బొంతల వెంకటరావు, మేళస్త్రీ అప్పారావు, కొత్తవలస సర్పంచ్ రామస్వామి, పిఎస్ ఎన్ పాత్రుడు, తుమ్మికాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన జాతీయ తైక్వాండో రిఫరీ శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 5వరకు జరుగుతున్న నేషనల్ రెఫరీ సెమినార్‌కు రాష్ట్ర మరియు దేశవ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడాకారులకు ఇంటర్నేషనల్ క్లాస్ 1 రెఫరీ తిరుమల్ జయపాల్ తర్ఫీదు ఇచ్చి సర్టిఫికెట్లు అందజస్తారని న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్. వేణుగోపాల్ రావు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాప్టా అధ్యక్షులుపి. అచ్చుతారెడ్డి , విజయనగరం తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ గురాన అయ్యలు, తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కె.శ్రీహరి తదితరులు హాజరయ్యారు.

నేడు బానాదిలో శ్రీభరత్ ప్రచారం

వేపాడ : మండలంలో బానాది, బల్లంకి గ్రామాల్లో టిడిపి విశాఖ ఎమ్‌పి అభ్యర్థి ఎం.శ్రీభరత్ ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రంలోని జాలార వీధిలో ఈనెల1న జరిగిన వివాదంలో రామకృష్ణ అనే వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు ఎస్ఐ పి నరసింహమూర్తి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కోట రామకృష్ణకు బర్రి హరి భార్యతో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో రామకృష్ణపై హత్యాయత్నానికి పాల్పడిన బర్రి లక్ష్మణరావు, హరినారాయణ. మువ్వల సూర్యనారాయణ, సూరిబాబుపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉడాకాలనీలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని క్లబ్ గవర్నర్ జామి నారాయణ స్వామి శుక్రవారం ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో ఈ మజ్జిగ చలివేంద్రాలు ప్రజలకు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ఎస్ రాజు. వి.సుబ్బరాజు, జి.కృష్ణంరాజు, కొత్తలి ఎర్రి నాయుడు, ఎం.త్రినాధరావు తది తరులు పాల్గొన్నారు.



సిపిఎం సీనియర్ నాయకులు సత్యంనాయుడును పరామర్శిస్తున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు సుబ్బరావమ్మ

11లోగా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 11వతేదీ నాటికి జిల్లాలో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని తహశీల్దార్లు,ఎంపిడిఒలకు జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. s పోలింగ్ కేంద్రగక్ష్మి ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, ర్యాంపు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. శుక్రవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. 12వ తేదీనే ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారని, అందువల్ల 11వ తేదీ నాటికే ఏర్పాట్లు పూర్తి కావాలని ఆదేశించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఆరు మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. సిబ్బందికి, ఓటర్లకు సరిపడే తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని గదుల్లో తగినంత లైటింగ్ ఉండాలని, బాత్ రూముల్లో కూడా లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సులువుగా గుర్తించే విధంగా నేమ్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఓటర్లు ఎండకు ఇబ్బంది పడకుండా నీడ కోసం టెంట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ సిబ్బందికి ఆహార, పానీయాలను అందించాలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ఆహార పదార్ధాలను ఇవ్వాలన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్దా ఓటరు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఇక్కడ బిఎల్‌ఒలు అందుబాటులో ఉండి ఓటర్లకు సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల ఏర్పాట్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు పునాది శ్రీరామ్మూర్తి

(మొదటిపేజీ తరువాయి)

చేశారని కొనియాడారు. ఉద్యమాల్లో ఎంతో చురుకుగా పని చేశారని, పార్టీ అప్పగించిన ప్రతి పనీ విజయవంతం చేశారని అన్నారు. ఆయన ఆశయ సాధనకు కషి చేయడమే నిజమైన నివాళి అని అన్నారు. సిపిఎం విజయనగరం జిల్లా నాయకులు రెడ్డి శంకర్రావు మట్లాడుతూ సీతానగరం మండల ప్రజానీకం కాలుష్య భారిన పడకుండా రక్షించిన ఘనత శ్రీరామ్మూర్తిదేనన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు రమణి మట్లాడుతూ శ్రీరామ్మూర్తితో కలిసి అనేక ప్రజా ఉద్యమాలు చేపట్టామన్నారు. ఎంతో నిస్వార్థం గా , నిజాయితీ గా పనిచేశారని కొనియాడారు. శ్రీరామ్మూర్తి సతీమణి శ్రీదేవి మట్లాడుతూ తన భర్త మరణం తరువాత తమ గ్రామం, సిపిఎం పార్టీ వెన్నుదన్నుగా నిలిచారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని తెలిపారు.

రేపు విద్యుత్తు అంతరాయం

రేగిడి : మండలంలోని ఉంగరాడ మెట్ట సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి ఎంహెచ్ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎఇ హరిబాబు తెలిపారు. ఉంగరాడ మెట్ట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి గ్రామాలలైన రేగిడి, ఆమదాలవలస, మండల కాంప్లెక్స్ కార్యాలయాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుర్బుద్ధితోనే దుష్ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

జిరాక్సు కాపీలు ఇస్తారంటూ దుష్ప్రచారం చేయడం తగదని అన్నారు. అటువంటి తప్పుడు నిర్ణయాలు ఎవరూ చేయరని అన్నారు.

జిల్లాలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో సినీనటుడు బాలకృష్ణ తనపై చేసిన ఆరోపణలను బొత్స తిప్పికొట్టారు. రాష్ట్రంలోని విద్యారంగంపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, విద్యారంగ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాల్ చేశారు. సెలబ్రిటీలు కాబట్టి ఏది మాట్లాడితే అది చెల్లిపోతుందని అనుకుంటున్నారని, విద్య గురించి తెలియకపోతే తెలుసుకోవాలని అన్నారు. పేదల కోసం బాలకృష్ణ తండ్రి ఎన్‌టిఆర్ గాని, బావ చంద్రబాబు గాని ఏనాడైనా ఆలోచన చేశారా అని ప్రశ్నించారు. విద్యా విధానంపై తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు అభివృద్ధి కోసమేనని, ప్రపంచస్థాయిలో అందరితో పోటీ పడేందుకే ఈ సంస్కరణలను తీసుకొచ్చామని తెలిపారు. 3వ తరగతి నుంచే ఇంగ్లీషులో ప్రావీణ్యం ఇప్పిస్తున్నామని చెప్పారు. డిగ్రీలో ఇంటర్న్‌షిప్ ఇచ్చి నూటికి 90శాతం మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టిడిపి దుర్మార్గులు పెట్టిన ఫిర్యాదుల వల్లే నేడు పింఛనుదార్లు అష్టకష్టాలు పడుతున్నారని అన్నారు. 30 మంది చావుకు కారణమయ్యారని అన్నారు. వృద్ధులు, వికలాంగుల పాపం వారికి తప్పకుండా తగులుతుందని అన్నారు.



జిల్లాలో శతశాతం ఓటింగ్ నమోదు చేసే లక్ష్యంతో జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశాల మేరకు, వివిధ వర్గాల ప్రజలకు విస్తతంగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తాము ఓటు వేసేందుకు అనువైన వాతావరణాన్ని, వసతులను, ప్రత్యేక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు.

– ప్రజాశక్తి, విజయనగరం కోట

- విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక సదుపాయాలు
- పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి ర్యాంపులు, వీల్‌చైర్లు
- బ్రెయిలీ లిపిలో నమూనా బ్యాలెట్ పేపర్
- వృద్ధులు, వికలాంగులకు హోం ఓటింగ్‌కు అవకాశం

నిర్భయంగా ఓటేయొచ్చు!

పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు

వికలాంగులు తమ ఓటుహక్కును వినియోగించుకొనేందుకు పోలింగ్ కేంద్రంలోకి చేరుకొనేవిధంగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులను నిర్మించారు. జిల్లా వ్యాప్తంగా 1847 పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు ఏర్పాటు చేయగా, సాలూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న మెంటాడ మండలంలో కూడా 50 పోలింగ్ కేంద్రాలకు ర్యాంపులను ఏర్పాటు చేశారు. వీల్ ఛైర్లు, త్రిచక్ర వాహనాల ద్వారా వీరు ర్యాంపుల మీదుగా పోలింగ్ కేంద్రంలోనికి సులువుగా చేరుకోవచ్చు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు తదితర కనీస సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

అందుబాటులో వీల్ ఛైర్లు

నడవలేని వారిని పోలింగ్ కేంద్రంలోకి చేర్చేందుకు వీల్‌ఛైర్లు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 716 వీల్‌చైర్లను సిద్ధం చేశారు. రాజాం నియోజకవర్గంలో 144, బొబ్బిలిలో 113, చీపురుపల్లిలో 138, గజపతినగరంలో 76, నెల్లిమర్లలో 56, విజయనగరంలో 76, శృంగవరపుకోట నియోజకవర్గంలో 87, మెంటాడ మండలంలో 26 వీల్‌ఛైర్లు అందుబాటులో ఉంచుతున్నారు. ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ ఎస్కార్ట్‌ల సహకారంతో వీల్‌ఛైర్ల ద్వారా దివ్యాంగులు, వయోవృద్ధులు పోలింగ్ కేంద్రంలోకి చేరుకొని ఓటు వేయవచ్చు.

బ్రెయిలీ లిపిలో

అంధుల కోసం ప్రత్యేకంగా బ్రెయిలీ లిపిలో ఓటర్ స్లిప్పులు, పోస్టర్లను ముద్రిస్తున్నారు. తమ ఓటు వివరాలను తెలుసుకొనేందుకు అంధులకు బ్రెయిలీ లిపిలో సుమారు 4,865 ఓటర్ స్లిప్పులను ముద్రించి, వారికి అందజేయనున్నారు. అలాగే బ్రెయిలీలో పోస్టర్లను ముద్రించి అన్ని పోలింగ్ కేంద్రాలవద్ద ఉంచుతారు. ఈ పోస్టర్లలో పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలు ఉంటాయి. బ్రెయిలీ తెలిసిన అంధులు వీటిని చదివి ఓటు వేయవచ్చు. పోలింగ్ కేంద్రాల వద్ద మాట ద్వారా కూడా పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలను తెలియజేస్తారు. ఇవిఎం మిషన్లపై బ్రెయిలీ లిపిలో అభ్యర్థుల వరుస నంబర్లను తెలియజేసే సౌకర్యం ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తెచ్చింది.

హోం ఓటింగ్ కు అవకాశం

పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయడానికి అవకాశం లేని 85 ఏళ్ల పైబడిన వయో వృద్ధులు, 40 శాతం వికలాంగత్వం దాటిన విభిన్న ప్రతిభావంతులు తమ ఇంటివద్దనే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ఈ ఏడాది కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లాలో సుమారు 21,993 మంది విభిన్న ప్రతిభావంతులు, 85 ఏళ్ల పైబడిన సుమారు 7181 మంది వృద్ధులు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో హోం ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవడానికి 86 మంది వికలాంగులు, 156 మంది వృద్ధులు ధరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 10 తేదీ మధ్య అధికారులు వీరి ఇళ్లకు వెళ్లి ఓటు తీసుకుంటారు. దీనికోసం జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

ఓటర్ గైడ్లు పంపిణీ

ఓటు హక్కు వినియోగంపై విస్తతంగా అవగాహన కల్పించేందుకు ఓటర్ గైడ్లను ముద్రించారు. ఇలా సుమారు 35,000 ఓటర్ గైడ్లను ముద్రించి, పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఓటు పొందే విధానం, వేసే విధానం, పోలింగ్ కేంద్రం ఏర్పాటు, నిర్వహణ, ఇవిఎంల ద్వారా, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే విధానం, హోం ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించే పద్ధతి, సాక్షం యాప్ తదితర అంశాలను ఈ ఓటర్ గైడ్లలో పొందుపరిచారు.

సాక్షం యాప్

వికలాంగుల సహాయం కోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా సాక్షం యాప్‌ను రూపొందించింది. ఓటరుగా నమోదు చేసుకోవడం, మార్పులు, చేర్పులు, పోలింగ్ కేంద్రాన్ని తెలుసుకోడం, వీల్ చైర్, రవాణా సదుపాయాన్ని కోసం అభ్యర్థన, అంధులకు వాయిస్ ద్వారా సహకరించడం, వినికిడి లోపం ఉన్నవారికి టెక్స్ట్ టు స్పీచ్ థెరపీ తదితర సహాయ సహకారాలను ఈ యాప్ ద్వారా విభిన్న ప్రతిభావంతులు పొందవచ్చు.

మోడల్ పోలింగ్ స్టేషన్లు

వికలాంగులకు ఓటు వేసే విధానం పట్ల మరింత అవగాహన కల్పించేందుకు, వారిని పోలింగ్ కేంద్రాలకు రప్పించేందుకు జిల్లాలో రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విజయనగరంలోని కొత్త అగ్రహారం, నెల్లిమర్ల నియోజకవర్గంలోని డెంకాడ మండలం పూతికపేట పోలింగ్ కేంద్రాలను మోడల్ పోలింగ్ కేంద్రాలుగా తీర్చి దిద్దారు. ఇక్కడ ర్యాంపులు, తాగునీరు, వైద్య సదుపాయంతోపాటు, ప్రత్యేక మరుగుదొడ్లను కూడా ఏర్పాటు చేశారు.

విస్తత అవగాహనా కార్యక్రమాలు

విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు, హిజ్రాలకు అవగాహన కల్పించి, వారికి ప్రత్యేక సదుపాయాలను కల్పించి, వీరందరితో ఓటు వేయించేందుకు దివ్యాంగుల సంక్షేమశాఖ ఎడి జివిబి జగదీష్‌ను సౌలభ్య నోడల్ అధికారిగా, జిల్లా కలెక్టర్ నియమించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంతోపాటు, నియోజకవర్గ కేంద్రాల్లో కూడా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. ఓటు కలిగి ఉన్న విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు, హిజ్రాలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి

సార్వత్రిక సంగ్రామం



ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
శనివారం
4 మే 2024

పార్వతీపురం.. ఎవరి పరం?

త్రిముఖ పోటీలో ఎవరికి వారే ధీమా

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురం ఎస్‌సి రిజర్వు అసెంబ్లీ నియోజకవర్గం ఎవరి పరం కానుంది. సిట్టింగ్ ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు ఎదురీత తప్పదా? కొత్తగా తొలిసారి బరిలో దిగిన టిడిపి అభ్యర్థి విజయచంద్ర నెగ్గుకొస్తారా? ఇండియా వేదిక మద్దతుతో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఏ మేరకు రాణిస్తారు.. అంటూ నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. నియోజకవర్గంలో 10 నామినేషన్లు దాఖలుకాగా ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు తన నామినేషన్‌లను ఉపసంహరించుకున్నారు. ప్రధానంగా పోటీ పడేది ప్రధాన పార్టీల నుండి ముగ్గురే అభ్యర్థులు.



అలజంగి జోగారావు
వైసిపి



బోనెల విజయచంద్ర
టిడిపి



బత్తిన మోహనరావు
కాంగ్రెస్


వైసిపి నుండి రెండోసారి ప్రస్తుత ఎమ్మెల్యే అలజంగిజోగారావు పోటీ చేస్తుండగా, టిడిపి బోనెల విజయచంద్రను రంగంలోకి దించింది. ఇండియా కూటమి తరపున కాంగ్రెస్ పార్టీ నుండి బత్తిన మోహనరావు పోటీ చేస్తున్నారు. గత ఆర్నెళ్లుగా ప్రచారం ప్రారంభించిన స్వతంత్ర అభ్యర్థి, గర్భాపు ఉదయభాను కూడా ఎంతో కొంత ఓటర్లపై ప్రభావం చూపిస్తారనే వాదన ఉంది. ఇక మిగతా నలుగురు అభ్యర్థులు అంతంత మాత్రమే. ఇప్పటికే ప్రచార బరిలో దిగిన వైసిపి, టిడిపి పార్టీలు ఒకరికి మించి ఒకరు ప్రచారం సాగిస్తున్నారు. వైసిపి పార్టీకి బలమైన అభ్యర్థితో పాటు, నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ పటిష్టమైన కేడర్ కలిగి ఉంది. అయితే ఎమ్మెల్యేపై అవినీతి ఆరోపణలు ఆయనకు మైనస్‌గా మారుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందువరకు వైసిపితో పోలిస్తే టిడిపి బలహీనంగా కనిపించినప్పటికీ, బిజెపి,జనసేన కూటమి కలసి రావడం, టిడిపిలోని పాత నాయకులు దూరంగా ఉండడంతో దీన్ని అవకాశంగా మార్చుకుని ఇంత వరకూ స్తబ్దుగా ఉన్న ఆపార్టీలో యువ కార్యకర్తలు, నాయకులు రెట్టింపు ఉత్సాహంతో టిడిపి గెలుపునకు పనిచేస్తున్నారు. అయితే మాజీఎమ్మెల్యే బి.చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఈయనకు ఏ మేరకు సహకరిస్తారో చూడాల్సి ఉంది.

ప్రభుత్వ వ్యతిరేకత, ఉమ్మడి మేనిఫెస్టో పైనే ఆశలన్నీ

టిడిపి అభ్యర్థి బోనెల విజయచంద్ర ప్రభుత్వ వ్యతిరేకత, ఉమ్మడి మేనిఫెస్టోపైనే ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాలలో వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత,స్థానిక ఎమ్మెల్యేపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి, జనసేన, టిడిపి కలసి ప్రకటించిన ఉచిత సంక్షేమ పథకాల హామీలపైనే ఎక్కువగా ఆశలు పెట్టుకుని, ఆదిశగా, ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు. విజయచంద్ర రాజకీయాలకు కొత్తకావడంతో వ్యక్తిగతంగా అతనిపై ఎటువంటి అవినీతి ఆరోపణలు లేకపోవడం ప్రత్యర్థితోపోలిస్తే కలిసివచ్చే అంశం. కూటమి భాగ స్వామ్య పార్టీకి చెందిన జన సేన యువ కార్య కర్తలు, టిడిపి కేడర్‌తో కలిసి ఐక్యంగా పనిచేయడంతో టిడిపి అభిమానులు, తటస్థులు కలసి వస్తున్నారు. అయితే సిట్టింగ్‌ఎమ్మెల్యే అలజంగిజోగారావు అంగబలం, అర్థబలం ముందు ఎంత వరకూ ఇవి పనిచేస్తాయన్నది అనుమానమే. నియోజకవర్గానికి కొత్తముఖమైన బోనెల విజయచంద్ర టిడిపిలోని సీనియర్‌లతో పాటు, కొన్ని వర్గాలను కలుపుకు పోవడంలో విఫలమైతున్నారని, ఆయన ఏకపక్షధోరణి కార్యకర్తలకు, అభిమానులకు మింగుడుపడడంలేదని, ఖర్చు విషయంలో కూడా చాలా వెనుకంజలో ఉండడం కూడా ఆయనకు మైనస్సేనని చెబుతున్నారు. ఈ పరిస్థితులన్నిటిని అధిగమించి, ప్రత్యర్థి రాజకీయ చాణక్యాన్ని ఎదురొడ్డి ఎంతవరకు విజయ సాధిస్తారనేది చూడాలి.

సంక్షేమ పథకాలు, వాలంటీర్లపైనే నమ్మకం

వైసిపి అభ్యర్థి అలజంగి జోగారావు సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఆకర్షించడం, వాలంటర్లను మచ్చిక చేసుకోవడంతోపాటు ఎన్నికలలో నెగ్గేందుకు పక్కా ప్రణాళికతో, పదనైన వ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు. పార్టీ ఇచ్చిన గడపగడపకు వంటి కార్యక్రమా లన్నిటికీ




సద్వినియోగం చేసుకున్నారు. స్థానిక ఎన్నికలలో జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్‌లు, చైర్‌పర్సన్ పదవులను తనకు అను కూలమైన వారితో నింపుకున్నారు. నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో స త్స ంబంధాలు ఏర్పరు చుకున్నారు. అయితే గత ఐదేళ్ల కాలంలో ఆయనపై భూకబ్జాలు, అవినీతి, వంటి ఆరోపణలు బాగా వినిపించాయి. అవే ఆయన కొంప ముంచుతాయన్న చర్చ జరుగుతోంది. టిడిపికి ప్రజల్లో ఆదరణ ఉన్నప్పటికీ, గ్రామాల్లో సరైన నాయకత్వం లేకపోవడాన్ని తనకు అనుకూలంగా మలుచుకుని గతం కంటే ఎక్కువ మెజారిటీతో గెలవడానికి ప్రయత్నిస్తున్నారు.

అధికార, ప్రతిపక్షాల వైఫల్యాలే ఆయుధాలు

కాంగ్రెస్ అభ్యర్థి బత్తిన మోహనరావు పాలకొండకు చెందిన యువన్యాయవాది. రాజకీయాలతో పాటు, నియోజకవర్గానికి క కూడా కొత్త. ప్రభుత్వ వ్యతిరేకత, ప్రతిపక్షంగా టిడిపి వైఫల్యాలు, స్థానిక అభ్యర్థి జోగారావు అవినీతి గురించి ప్రచారం చేస్తూ ఈ ఎన్నికలలో నెగ్గాలని ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా నే కాకుండా ఇండియా వేదిక అభ్యర్థి కావడంతో సిపిఎం,సిపిఐ పార్టీలు ఆయన గెలుపుకోసం కృషి చేస్తుండటం ఆయనకు కలసి వచ్చిన అంశం. సీతానగరం మండలం పెదభోగిలి కి చెందిన ఈయన విశాఖపట్టణంలోని నావల్ డాక్‌యార్డులో ఉద్యోగం చేస్తున్నప్పుడు కాంగ్రెస్ సంబంధిత కార్మిక సంఘాలకు నాయకత్వం వహించిన అనుభవం ఉంది. దీనితోపాటు మాజీ కేంద్రమంత్రి వైరిచర్ల కిశోర్‌పై అభిమానంతో ఉద్యోగ విరమణ అనంతరం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి అతనికి అనుచరుడుగా మారారు.

రాజాంలో గెలుపెవరిది?

- టిడిపి, వైసిపి మధ్య పోటీ
- నామమాత్రంగా స్వతంత్ర అభ్యర్థులు
- ప్రధాన పార్టీలకు చెందిన ఐదుగురూ విద్యావంతులే





తలే రాజేష్
వైసిపి



కోండ్రు మురళీ
టిడిపి



కంబాల రాజవర్ధన్
కాంగ్రెస్

ప్రజాశక్తి- రేగిడి

రాజాం నియోజకవర్గ సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీలు టిడిపి, వైసిపి, కాంగ్రెస్‌తో పాటు మరో ఏడు పార్టీలు పోటీలో ఉన్నాయి. ఈ ఎన్నికల్లో టిడిపి, వైసిపి పార్టీల మధ్య ప్రధాన పోటీగా ఉంది. వీరి తరువాత స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి కూడా పోటీ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రచారాల్లోనూ టిడిపి, వైసిపి పార్టీలే కీలకంగా మారాయి. ఎత్తుకు పై ఎత్తివేసి ఓటర్లను ఆకట్టుకునే విధంగా ప్రచారాలు చేస్తున్నారు. గ్రామాల వారీగా ముందుగా చర్చలు జరిపి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఇక్కడ పోటీ చేస్తున్న బిఎస్‌పితో పాటు మిగతా ఇండిపెండెంట్ అభ్యర్థుల పాత్ర ఈ ఎన్నికల్లో నామమాత్రంగానే ఉండనుంది. టిడిపి, వైసిపి, కాంగ్రెస్, బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థులు నలుగురుతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థుల్లో కొంతమంది విద్యావంతులే ఉన్నారు.

2009లో రాజాం నియోజకవర్గం ఎస్‌సి రిజర్వేషన్ అయింది. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో లావేరు మండలంల లావేటిపాలెం గ్రామానికి చెందిన టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీ, పాలకొండకు చెందిన తలే భద్రయ్య కుమారుడు తలే రాజేష్ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగారు. పాలకొండ మండలం చిన్న మంగళాపురానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కంబాల రాజరత్నం కుమారుడు కంబాల రాజవర్ధన్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్నారు. వీరంతా ఈ నియోజకవర్గానికి వలస నాయకులే.

2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కాంగ్రెస్ పార్టీ తరపున కోండ్రు మురళీ గెలుపొంది మంత్రి పదవి కూడా చేపట్టారు. 2014 ఎన్నికల్లో టిడిపి తరపున కొండ్రు మురళి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయగా, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా కంబాల జోగులు చేతిలో ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో మరోసారి కోండ్రు మురళి, కంబాల జోగులు పోటీ చేయగా వైసిపి ఎమ్మెల్యేగా కంబాల జోగులు రెండో సారి విజయం సాధించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ముచ్చటగా మూడోసారి టిడిపి అధిష్టానం కోండ్రు మురళికి టిక్కెట్టు కేటాయించింది. వైసిపి సిటింగ్ ఎమ్మెల్యే కంబాల జోగులపై సర్వే నిర్వహించి ఆ సర్వేలో ఆయనకు వ్యతిరేకంగా రావడంతో జోగులను పాయకరావుపేటకు బదిలీ చేసి అక్కడ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దించారు. అనంతరం పరిమాణాల దృష్ట్యా ఆర్థోపెటిక్ వైద్యులు తలే రాజేష్‌కు అనూహ్యంగా నియోజకవర్గ వైసిపి ఇంఛార్జిగా బాధ్యతలు అప్పగించి టిక్కెట్టు కూడా ఆయనకే కేటాయించారు. పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కంబాల రాజ వర్ధన్‌ను బరిలోకి దించారు. అయితే టిడిపి తరపున పోటీ చేస్తున్న కోండ్రు మురళి ఇంజనీర్ కాగా, వైసిపి తరపున పోటీ చేస్తున్న తలే రాజేష్ ఎంబిబిఎస్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న కంబాల రాజవర్ధన్ ఎంసిఎ ఉన్నత చదువులు అభ్యసించారు. ఈ ముగ్గురు విద్యావంతులైనప్పటికీ రాజకీయంగా ప్రత్యర్థులుగా ఉండి ముమ్మరంగా ప్రచారాలు చేపడుతున్నారు బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థిగా బుధుడు ఉపాధ్యాయ వృత్తి చేసి పదవీ విరమణ పొందారు. రాజాం నియోజకవర్గ జనసేన ఇంఛార్జిగా ఉంటూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్న ఎన్ని రాజు గత టిడిపి హయాంలో పాలకొండ జెడ్‌పిటిసిగా పని చేశారు. అయినప్పటికీ ఇక్కడ టిడిపి, వైసిపి నాయకుల మధ్య ప్రధాన పోటీ నెలకొననుంది. కాగా రెండు సార్లు ఓటమి చెందిన కోండ్రు మురళీకి సానుభూతి కలిసొచ్చే అవకాశాలున్నాయని ఆ పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. కాగా ఈ నియోజకవర్గంలో మూడోసారి వైసిపికే ప్రజలు పట్టం కడతారని వైసిపి నమ్మకంతో ఉంది. దీంతో ఎవరు విజయం సాధిస్తారో అంచనాలు వేయలేకపోతున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.


ఎన్నికల్లో ఆమె ఎటువైపు

- చీపురుపల్లి నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికం
- 2,05,484 మంది ఓటర్లలో 1,02,847 మంది వారే

ప్రజాశక్తి- చీపురుపల్లి

మహిళలు నిర్ణయం తీసుకుంటే తిరుగులేదు. ఆమె ఎటు వైపు నిర్ణయించుకుంటే అటువైపే విజయం. ఎన్నికలలో నిలిచే అభ్యర్థి గెలవాలన్నా.. ఓడి పోవాలన్నా మహిళలు తీసుకునే నిర్ణయంపైనే ఆదారపడి ఉంటుందనేది జగమెరిగిన సత్యం. ఒకప్పుడు మహిళలు ఇంట్లో పురుషులు ఎవరికి ఓటు వేయమంటే వారికే ఓటు వేసేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. కొన్నేళ్లుగా రాష్ట్రంలోని మహిళలు వాళ్ల సొంత కాళ్లపై వాళ్లు నిలబడుతున్నారు. శ్రమైక సంఘాల ద్వారా, డ్వాక్రా సంఘాల ద్వారా ఆర్థిక స్వాలంభనను సాధిస్తున్నారు. సొంతంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయం, వృత్తి పనులు, కూలీ పనులు చేసి ముందుండి కుటుంబాలను నడుపుతున్నారు. ఈ క్రమంలో ఎవరికి ఓటు వేయాలో వారి అంతరాత్మ ప్రబోధం మేరకు మహిళలు ఓటేస్తున్నారు. ఇది గమనించిన రాజకీయ పార్టీలు వారి వారి మేనిఫెస్టోలో ఎక్కువ శాతం తాయిళాలు మహిళలకే ప్రకటిస్తున్నారు. మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు నానా తంటాలు పడుతున్నాయి. మహిళల ఓట్లని ఆకట్టుకొని తమ వైపు తిప్పుకోవాలంటే ఇంకేమేమి చేయాలో అన్ని దారులను వెతికి వెతికి మరీ మహిళలకు పెద్దపీట వేసి ఓట్లను దండుకునే పనిలో రాజకీయ నాయకులు పడరాని పాట్లు పడుతున్నారు. అందులో భాగంగానే మన రాష్ట్రంలో కూడా అటు తెలుగుదేశం, జనసేన, బిజెపి, ఇటు వైసిపి, కాంగ్రెస్ పార్టీలు తమ తమ మేనిఫెస్టోలో మహిళలకు తాయిలాలు ప్రకటించాయి. ఓటర్లలో సగభాగమైన మహిళలు ఎటువైపు నిలిస్తే వారికే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయి.

ఇది ఇలా ఉండగా చీపురుపల్లి నియోజకవర్గంలో 2,05, 484 మంది ఓటర్లున్నారు. వీరిలో మహిళలు 1,02,847 మంది ఉన్నారు. పురుషులు 1,02,627 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండడంతో రాజకీయ నాయకులు చెమటోడ్చి ఎక్కడ ఉపాధిహామీ పనులు జరుగుతున్నాయో అక్కడకు వెళ్లి వారిచ్చే తాయిళాలు చెప్పి ఓట్లుని అర్థిస్తున్నారు. ఈ నేపద్యంలో ఈ నెల 13న జరిగే ఎన్నికలలో మహిళామణులు ఎవరికి ఓటు వేసి గెలిపిస్తారో అనేది జూన్ 4 వరకు వేచి చూడాల్సి ఉంది.



ముగ్గురు ఎమ్మెల్యేల ముగడ

ఒకే కుటుంబం నుంచి..



లక్ష్మనాయుడు



జయప్రకాశ్



లక్ష్మనాయుడు

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని రాజకీయ ప్రత్యేకత ఉన్న గ్రామం.. ముగడ. ఇటీవల బొబ్బిలి పట్టణాభివృద్ధి సంస్థ (బుడా) అధ్యక్షునిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు (రాజా) ఈ గ్రామానికి చెందిన వారే. ఆయన తండ్రి తెంటు జయప్రకాశ్, తాత తెంటు లక్ష్మునాయుడు కూడా ఎమ్మెల్యేలుగా పనిచేశారు. తెంటు లక్ష్మునాయుడు 1977 వరకు రెండు సార్లు ఎమ్మెల్యేగా మానాపురం, బొబ్బిలి నియోజకవర్గాల నుంచి ఎన్నికయ్యారు. ఆయన కుమారుడు, కీర్తిశేషులు తెంటు జయప్రకాశ్ తెర్లాం నుంచి 1983, 85, 89, 94, 2004లో ఎన్నికయ్యారు. పదవిలో ఉంటూ 2008 జనవరి 6న కన్నుమూశారు. ఆయన అకాల మరణంతో జరిగిన ఉపఎన్నికల్లో కుమారుడు లక్ష్మునాయుడు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ విధంగా ఒకే గ్రామంలో ముగ్గురు ఎమ్మెల్యేలుగా ఎన్నికై జిల్లా చరిత్రలో నిలిచారు.

మహిళా ఓటర్లే కీలకం

ప్రజాశక్తి - కురుపాం

సార్వత్రిక ఎన్నికల్లో నేతల తలరాతల్ని మార్చే ఓటుది కీలక పాత్ర. అందరూ తప్పనిసరిగా ప్రజాస్వామ్య వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల కమిషన్ సూచిస్తుంది. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు వేయాలని చెబుతుంది. ఈ నేపథ్యంలో నేతల భవిష్యత్తును మార్చడంలో కురుపాం నియోజకవర్గంలో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. కురుపాం అసెంబ్లీ నియోజకవర్గంలో పురుష ఓటర్లు కంటే 5,400 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,94,114 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 94,336, మహిళా ఓటర్లు 99,736, థర్డ్ జెండర్ 42 మంది ఓటర్లు ఉన్నారు. కురుపాం మండలంలో 16,966 మంది పురుష ఓటర్లు ఉండగా 18,237 మహిళా ఓటర్లు, 12 మంది థర్డ్ జెండర్ ఉన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో 16,097 మంది పురుష ఓటర్లు 18852 మంది, మహిళా ఓటర్లు, 16 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. జియ్యమ్మవలస మండలంలో 21,939 మంది పురుషులు, 22,187 మంది మహిళా ఓటర్లు 8 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. కొమరాడ మండలంలో 19,879 మంది పురుష ఓటర్లు ఉండగా 21,203 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్ ముగ్గురు ఉన్నారు. గరుగుబిల్లి మండలంలో 19,455 మంది పురుషులు, 19,257 మహిళా ఓటర్లు ఉన్నారు. ఇక్కడ థర్డ్ జెండర్లు లేరు. దీంతో అభ్యర్థుల విజయం మహిళా ఓటర్లపైనే ఆధారపడి ఉంది.

ఏడి 'పెంఛన్'

వితంతువులు, వృద్ధులకు అవస్థలు

బ్యాంకుల వద్ద పడిగాపులు

మండుటెండలో ముప్పు తిప్పలు



కురుపాంలో ఎస్‌ఐబి వద్ద నిరీక్షిస్తున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి - కురుపాం

ఎన్నికల కోడ్ నేపథ్యంలో రెండో నెలలుగా పింఛనుదారులకు తిప్పలు తప్పడం లేదు. గత నెలలో సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసిన పింఛనుదారులు ఈనెల బ్యాంకు ఖాతా పుస్తకాలు పట్టుకుని బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. అయితే సొమ్ము పడలేదని చెప్పడంతో సచివాలయాలకు వెళ్లి ఏ ఖాతాలో పడిందోనని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఎప్పుడో మూతపడిన ఖాతాలో పడిందని తెలుసుకుని ఆ బ్యాంకుకు వెళ్లి సిబ్బందిని బతిమలాడుతున్నారు. మళ్లీ ఖాతా పునరుద్ధరణకు బ్యాంకు మేనేజర్, డిప్యూటీ మేనేజర్ చుట్టూ ప్రదక్షిణలు తప్పడం లేదు. ఖాతా పునరుద్ధరణకు కనీసం రూ.300 నుంచి రూ.500 చెల్లించాలని చెబుతుండడంతో వృద్ధులు తలలు పట్టుకుంటున్నారు. ఓపక్క ఎండలు తీవ్రతతో తల్లడిల్లుతూ అష్టకష్టాలు పడి బ్యాంకులకు వస్తే ఖాతా పునరుద్ధరణకు సొమ్ము చెల్లించాలనడం దారుణమని లబోదిబోమంటున్నారు. ఏ ఖాతాలో సొమ్ము పడిందో తెలుసుకోవడమే పెద్ద పనిగా మారిందని వాపోతున్నారు. బ్యాంకులకు గిరిశిఖర గ్రామాల నుంచి 30 కిలోమీటర్ల దూరం నుంచి మండల కేంద్రాలకు వెళ్లాల్సి రావడంతో ఆటోలకు పెద్దఎత్తున ఖర్చువుతుందని చెబుతున్నారు. పింఛనుదారులతో బ్యాంకులన్నీ కిటకిటలాడుతున్నాయి. సచివాలయ ఉద్యోగుల ద్వారా పాత పద్ధతిలో ఇంటి వద్దకే పెన్షన్ సొమ్ము పంపిణీ చేయాలని వృద్ధులు, వితంతువులు కోరుతున్నారు.

వీరఘట్టం : మండలంలో పింఛనుదారులకు అవస్థలు తప్పడంలేదు. దీంతో మండల కేంద్రంలోని ఎస్‌ఐబి, యూనియన్‌బ్యాంకు, ఎపిజివి, తదితర బ్యాంకుల వద్ద పింఛను దారులు పడిగాపులు కాస్తున్నారు. ఒకవైపు ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున పింఛనుదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

మక్కువ : ప్రభుత్వం పింఛనుదారులకు బ్యాంకు ఖాతాలో పింఛను నగదును జమచేయడంతో లబ్ధిదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. సాలూరు మండలం నార్లవలస పంచాయతీ నక్కడవలసకు చెందిన మజ్జి లక్ష్మయ్య (75)ను పింఛన్ కోసం మక్కువలోని ఎస్‌బిఐ, ఎపిజివిబి బ్యాంకుల వద్దకు బంధువులు తీసుకొచ్చిన ఫలితం లేకపోయింది. ఏ బ్యాంకులో ఖాతా ఉందో తెలియక ఖాతా పుస్తకం తెమ్మంటూ బ్యాంక్ అధికారులు వెనుక్కు పంపించేయడంతో చేసేదేమీ లేక లబోదిబోమంటూ వెనుదిగారు. ఇదిలా ఉండగా చాలామందికి ఎఇపిఎస్ విధానంలో వేలిముద్రలు పడక మరోవైపు అవస్థలు పడుతున్నారు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని పెన్షన్లు పంపిణీ చేయాలని వారు ప్రాధేయపడుతున్నారు.

పార్వతీపురం టౌన్ : ప్రభుత్వం ఇచ్చే పింఛన్ల కోసం పట్టణంలో పలు బ్యాంకుల వద్ద లబ్ధిదారులు పడిగాపులు కాస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇదే ఆసరా తీసుకుని పట్టణంలోని పలు నెట్ సెంటర్లలో పింఛనుదారులకు రూ.3వేలు నగదును అందజేస్తూ రూ.30 కమిషన్ తీసుకోవడంపై లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సాలూరు రూరల్ : పింఛన్ల కోసం రెండో రోజు కూడా అదే పడిగాపులు. మండలంలోని మామిడిపల్లి యూనియన్ బ్యాంక్, విశాఖ గ్రామీణ బ్యాంక్ వద్ద ఉదయం 8 గంటల నుంచే బస్సులు, ఆటోల్లో వచ్చి బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మారిపల్లి, కూరుకుట్టి, సారిక, జిల్లేడు వలస, సంపంగి పాడు, దెన్నరాయి, కందుల పదం, కొట్టుపరువు, మావుడి, తుండా, అన్నంరాజువలస పంచాయతీల నుంచి ఆటోలపై, గిరిశిఖర గ్రామాలైన గంజాయిభద్ర, కొఠియా, కొదమ గ్రామాల నుండి కూడా వృద్ధులు జీపులపై ఒక్కొరికి రానూపోనూ రూ.200 ఇచ్చి బ్యాంకుల వద్దకు పెన్షన్ తీసుకోవడం ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. మరికొందరికి కో ఆపరేటివ్ బ్యాంక్‌లో ఎప్పుడో వ్యవసాయ రుణాలు వాడి అప్పులు కట్టకపోవడంతో అక్కడ ఖాతాలోకి జమైన నగదును అప్పులు ఖాతాలోకి జమ చేయడంతో లబ్ధిదారులు లబోదిబో మంటున్నారు.

సీతానగరం : స్థానిక ఎస్‌బిఐ, ఆంధ్రదా బ్యాంకుల వద్ద పింఛన్ల కోసం లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని బ్యాంకు వద్ద టెంటల్ ఏర్పాటు చేసినా పింఛనుదారులు ఇబ్బందులు పడ్డారు. గతంలో వలే పెన్షన్లను సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తే బాగుంటుందని పలువురు పింఛనుదారులు కోరుతున్నారు.

బొబ్బిలి : పింఛను కోసం వృద్ధులు మండుటెండలో పడరాని పాట్లు పడుతున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ అత్యవసరాల కోసం పింఛను డబ్బులు విత్ డ్రా చేసేందుకు బ్యాంకులకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాంకేతిక కారణాలతో కొంతమంది పింఛను డబ్బులు బ్యాంకు ఖాతాలలో జమ కాలేదు. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఎండలతో బ్యాంకులకు వస్తున్న వృద్ధులు.. ఇంటింటికి పంపిణీ చేయకుండా బ్యాంకులలో జమ చేసిన ప్రభుత్వానికి, వాలంటీర్లతో పంపిణీ చేసేందుకు అభ్యంతరం చెప్పిన ప్రతిపక్షాలకు శాపనార్థాలు పెడుతున్నారు.

రామభద్రపురం : పింఛన్ల కోసం వచ్చే వారితో బ్యాంకుల్లో రెండో రోజు రద్దీ కొనసాగింది. దీంతో పింఛనుదారులకు ఇక్కట్లు తప్పలేదు. పంపిణీలో సింహభాగం స్టేట్ బ్యాంకు సేవా కేంద్రాల్లోనే చేశారు. చాలా మంది లబ్ధిదారులకు ఎన్నో ఏళ్ల నుంచి బ్యాంకులో ఖాతా ఉన్నప్పటికీ లావాదేవీలు చేయకపోవడం, ఆధార్ అనుసంధానం లేకపోవడం, ఫింగర్ ప్రింట్లు స్కాన్ కాకపోవడం వంటి సమస్యలతో రెండో రోజు కూడా పింఛన్లు తీసుకోలేని పరిస్థితులు గోచరించాయి. మండుటెండలో బ్యాంకుల్లో, ఖాతా దారుల సేవా కేంద్రాల్లో డబ్బుల కోసం పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడ్డారు.

రెండో రోజూ తప్పని ఇబ్బందులు

వేపాడ : మండలంలో పింఛనుదారులకు రెండో రోజు శుక్రవారం కూడా ఇబ్బందులు తప్పలేదు. సుదూర గ్రామాల నుంచి మండల కేంద్రంలోని ఎస్‌బిఐ ఖాతాదారుల సేవా కేంద్రానికి మండుటెండలో రావాల్సి వచ్చింది. కడకొండ, సంజీవిమెట్ట, వావిలపాడు, నల్లబెల్లి, బాణాది, బల్లంకి, సింగరాయి, ఆతవ గ్రామాల నుంచి వృద్ధులు ఆటోలపై వచ్చి పింఛను తీసుకోవడం కనిపించింది. పక్కనే ఉన్న దేవరాపల్లి మండలం నుంచి పలువురు పింఛనుదారులు పింఛను డబ్బుల కోసం వచ్చారు. ఛార్జీల కోసమే రూ.100 నుంచి 200 వరకు పింఛను డబ్బుల నుంచి ఖర్చు చేయాల్సి వచ్చింది.

పనిచేయని అకౌంట్లలో డబ్బులు జమ

చీపురుపల్లి: మండుటెండలో పండుటాకుల వంటి వృద్ధులు ఫించన్ల కోసం వ్యయప్రయాసలు పడుతున్నారు. ఎప్పుడో ఓపెన్ చేసిన బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు వేయడం, అవి ఇప్పుడు పనిచేయకపో వడంతో వృద్ధులు అవస్థలు పడుతున్నారు. మండలంలో 8,824 మంది పింఛనర్లున్నారు. వీరిలో వృద్ధులు 4,446 మంది ఉన్నారు.





పార్వతీపురం ఎస్‌ఐబి వద్ద పింఛను కోసం ఉన్న వృద్ధులు ; వేపాడలో ఎస్‌బిఐ సేవా కేంద్రం వద్ద పింఛను కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు



బొబ్బిలిలో ఎస్‌ఐబి సేవా కేంద్రం వద్ద క్యూకట్టిన పింఛనుదారులు

వీరంతా పింఛన్ల కోసం బ్యాంకులు చుట్టూ తిరుగుతున్నారు.

బ్యాంకుల వద్ద పడిగాపులు

విజయనగరం టౌన్ : నగరంలో పలు బ్యాంకుల వద్ద వృద్ధులు, వికలాంగుల పరిస్థితి వర్ణణాతీతం. పెన్షన్ తీసుకొనే వ్యక్తితో పాటు మరొకరు పని మానుకొని రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో బ్యాంక్ లు వద్ద ఉన్న చెట్లు కింద సేద తీరుతున్నారు. పెన్షన్ దార్ల కోసం బ్యాంక్ ద్వారా ఉదయం పూట డబ్బులు ఇచ్చే ఏర్పాటు చేస్తే బాగుంటుందని పెన్షన్ దారుడు భీమారావు ప్రజాశక్తి తో అన్నారు. పెన్షన్ డబ్బులు మా ప్రాణం మీదకు వచ్చినట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

అత్యవసరాలు కోసం రావడం తప్పలేదు

కిరాణా బాకీలు, టీ షాపులకు చెల్లించాల్సిన బకాయి కోసం పింఛను డబ్బులు విత్ డ్రా చేసేందుకు రావడం తప్పలేదు. నెలంతా కిరాణా సామాన్లు తీసుకున్న షాపులకు బాకీలు చెల్లించకపోతే మాకు అరువు ఇవ్వరు. 25 కిలోమీటర్ల దూరంలోని ఎండలో బొబ్బిలి బ్యాంకుకు రావాల్సి వచ్చింది.

- జి.సోమమ్మ, బూర్జ,
సీతానగరం మండలం, పార్వతీపురం మన్యం జిల్లా

సొమ్మసిల్లి పోయాను

ఎండ తీవ్రతకు సొమ్మసిల్లిపోయాను. ఎండ ఎక్కువగా ఉండటంతో ఒకచోట కూర్చుని ఉండిపోయాను. ఎండ తగ్గిన తర్వాత ఇంటికి వెళ్లాను.

- జి.సింహాచలం, కోట సీతారాంపురం,
సీతానగరం మండలం, పార్వతీపురం మన్యం జిల్లా

ఆటోకు రూ.200 ఇవ్వాల్సి వస్తుంది

పింఛను ఇంటి వచ్చి ఇవ్వకుండా బ్యాంకులో జమ చేయడంతో ఆటో బుక్ చేసుకుని బ్యాంకుకు రావాల్సి వచ్చింది. పింఛను డబ్బులో ఆటోకు రూ.200 ఇచ్చాను. ప్రభుత్వం స్పందించి ఇంటింటికి పింఛన్లు ఇవ్వాలి.

- నక్క అప్పన్న, పెంట,
బొబ్బిలి మండలం

అడుగడుగున రమణకు ఆదరణ



కొమరాడలో ఓటర్లతో మాట్లాడుతున్న అభ్యర్థి రమణ

ప్రజాశక్తి - కొమరాడ

సిపిఎం అభ్యర్థి మండంగి రమణకు గిరిజనుల నుంచి విశేష ఆదరణ లభించింది. మండలంలోని నాగావళి ఆవల గల 9 పంచాయతీలకు సంబంధించిన గ్రామాల్లో సిపిఎం ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న మండంగి రమణకు, అరుకు పార్లమెంటు ఎంపీగా పోటీ చేస్తున్న పి.అప్పలనర్సకు సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీ గెలిపించాలని మండలంలోని తోడుము, మత్తూరు, కొట్టు, మాదలంగి, పూజారి గూడ, కెమిశీల, బంధవలస, పొడుగువలస, తులసివలస, చెక్కవలస, లాబేసు, కొరిసెల గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న మండంగి రమణ, సిపిఎం నాయకులు జగన్మోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: దేశంలో రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటే ఇండియా వేదిక సిపిఎం ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సకు ఓటు వేయాలని కాంగ్రెస్, సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం పూట వాకింగ్ చేసే వారిని కలిసి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య, సీనియర్ నాయకులు ద్వారపు రెడ్డి పుండరీకాక్ష నాయుడు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు ఎంపీ అభ్యర్థి అప్పలనర్స ని గెలిపించాలని కోరారు. మతోన్మాదంతో దేశంలో వున్న హిందూ ముస్లిం మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్న బిజెపి, దాని మిత్ర పక్షాలను ఓడించాలని కోరారు.

పాచిపెంట : ఇండియా వేదిక బలపరిచిన అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనరసను గెలిపించాలని కోరుతూ సిపిఎం నాయకులు మంచాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలోని ఈత మానువలస, పద్మాపురం, కోడికాళ్లవలస, కోటికిపెంట, కేసలి, మడవలస, కొత్తవలస, మిర్తివలస, తోటవలస, గడివలస, విశ్వనాధపురం, మంచాడ వలస, పనుకువలస గ్రామాల్లో ప్రచారం చేశారు. నిరంతరం పేదలు, గిరిజనులు, దళితుల కోసం పనిచేసిన సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి గెలిపించాలని కోరారు.

మక్కువ : ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతూ ప్రజలతో మమేకమై ఉండే సిపిఎం ఇండియా కూటమి ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనరసను గెలిపించాలని సిపిఎం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు వి.ఇందిర, ఎన్‌వై నాయుడు ప్రజలను అభ్యర్థించారు. మండలంలోని శంబరలో కీర్తిశేషులు రెడ్డి శ్రీరామమూర్తి మూడో వర్థంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళ్ల అర్పించారు. నివాళులు అర్పించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ అరకు పార్లమెంట్ అభ్యర్థి అప్పలనరసకు సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తాడంగి ప్రభాకర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: సిపిఎం అరకు పార్లమెంటు అభ్యర్థి పి.అప్పలనరసను గెలిపించాలంటూ మండలంలోని మూలలంక, సింధునగర్, గాదిలంక, చినగోర, నడుకూరు, విక్రాంపురం, కాగితాడ, కంబర, కంబరవలస తదితర గ్రామాల్లో సిపిఎం నాయకులు కె.మోహన్రావు, సిహెచ్ అమ్మనాయుడు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమం చేపట్టారు. పార్లమెంట్లో ప్రజా సమస్యల కోసం ప్రశ్నించే నాయకుడు అప్పలనర్సని అన్నారు. సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటేసి అప్పలనరసను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల సిపిఎం నాయకులు ఎన్ సింహాచలం, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

132 కెవి ఒంటితడి సబ్ స్టేషన్, 33 కెవి పద్మనాభం ఫీడర్, 11 కెవి సిఎంఆర్ ఫీడర్ ప్రాంతాల్లో మరమ్మతు పనులు నేపథ్యంలో శనివారం ఉదయం 7గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కెవి పద్మనాభం ఫీడర్ మీద ఉన్న 33/11 కెవి చాకలి పేట సబ్ స్టేషన్ పరిధిలో గల ముడిదాం, సుంకరిపేట, చెల్లూరు, కోరాడపేట, గుండాలపేట, గొల్లలపేట, 11 కెవి సిఎంఆర్ ఫీడర్ పరిధిలో ఉన్న విటి అగ్రహారం, బిసి కాలనీ, సంతోష్ నగర్, గణేష్ నగర్, వై జంక్షన్ ప్రాంతాలకు విద్యుత్తు నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

5న అండర్ - 23 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5న అండర్ - 23 విభాగంలో పురుషుల జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2001 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఒరిజనల్ ఆధార్, జన్మదిన ధ్రువపత్రాలతో పాటు స్టడీ సర్టిఫికెట్, ఆఖరి మూడేళ్ళ మార్కుల జాబితాలతో పోటీలకు హాజరు కావాలన్నారు. ఉదయం 6.30 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని, క్రీడాకారులు వైట్ డ్రెస్, సొంత కిట్‌తో హాజరు కావాలని కోరారు.



శ్రీరామ్మూర్తికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

శ్రీరామ్మూర్తి ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - కొమరాడ

మన్యం జిల్లాలో ప్రజల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన రెడ్డి శ్రీరామ్మూర్తి ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని దేవకోన పంచాయతీ అంటివలస, పెదశాఖలో శుక్రవారం రెడ్డి శ్రీరామ్మూర్తి తృతీయ వర్ధంతి సభ ఘనంగా జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు అర్పించారు. అనంతరం సాంబమూర్తి, ఎపి గిరిజన సంఘం నాయకులు సన్యాసిరావు, గంగరాజు మాట్లాడుతూ శ్రీరామ్మూర్తి అతి చిన్న వయసులోనే కమ్యూనిస్టు భావజాలంతో ఉద్యమ దశ వైపు వచ్చి రైతాంగ, వ్యవసాయ కూలీలు, పేదలు తదితరుల సమస్యలపై ఎనలేని సేవ చేసి అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. తోటపల్లి, పెద్దగెడ్డ నిర్వాసితుల సమస్య పరిష్కారం లోనూ, గిరిజన హక్కుల కోసం పోరాటం చేయడంలో ఆయన కృషి మరవరానిదని కొనియాడారు. కావున ఆయన ఆశయ సాధన దిశగా ప్రతి ఒక్కరూ సమస్యల పైన పోరాటానికి ముందుకు రావాలని, ఇలాంటి పోరాటాల స్ఫూర్తితోనే శ్రీరామ్మూర్తికి ఇచ్చిన ఘన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బోడియ పార్వతి, లక్ష్మి, ప్రసాద్, శేఖరు, మధు, కైలాస్, సుబ్బారావు, రమేష్, సుబ్బారావు, రామస్వామి పాల్గొన్నారు. అనంతరం మండలంలోని అంటివలస, పేద శాఖ, చీసాడవలస గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అరకు పార్లమెంటుకు, కురుపాం అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థులు పి.అప్పలనర్స, మండంగి రమణకు సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. అలాగే శనివారం కొమరాడలో సిపిఎం ఆధ్వర్యాన బహిరంగసభ జరుగుతుందని, ఈ సభకు ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరు కానున్నారని, దీనికి ప్రజలంతా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మధు, కైలాస్, రమేష్, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

వైద్యాధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా బుధవారం పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కె.విజయపార్వతి ఆరోగ్య కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష జరిపారు. సమీక్షలో ఆరోగ్య కార్యక్రమాల జిల్లా ప్రగతి నివేదికలను పరిశీలించారు. వెనుకంజలో ఉన్న పిహెచ్‌సిలపై ప్రత్యేక దృష్టి సారించింది పురోగతి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా గిరిజన, గిరిశిఖర ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు చేరువ కావడంలో జాప్యం లేకుండా శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం పట్టణంలో 14వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు, ఆర్బిఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్, ఎన్‌పిసి నోడల్ అధికారి డాక్టర్ వినోద్, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్, అప్తాల్మిక్ ఆఫీసర్ నగేష్ రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

దోమల నివారణకు డ్రైడేను పాటించాలి

దోమల వ్యాప్తి నియంత్రణకు డ్రైడే కీలకమని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి. జగన్ మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని డికె పట్నం, ఎన్.ములగ గ్రామాల్లో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. సిబ్బందితో కలిసి ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు పరిశీలించి దోమల లార్వా ఎక్కడైనా వృద్ధి చెందుతుందా అని తనిఖీ చేశారు. అలాగే జ్వర లక్షణాలతో ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు.ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ తదితర జ్వరాలకు కారణమవుతాయని, కాల్వల్లో చెత్త వేయరాదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వీటిని లక్ష్యంగా చేసుకొని డ్రైడే కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం డ్రైడే వివరాల ఆప్షెన్ నమోదు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఎంఒ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు కె.తిరుపతిరావు, లక్ష్మి, కార్యాలయ సిబ్బంది బి.ప్రసాదరావు, హెల్త్ సూపర్ వైజర్ కృష్ణ, సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐ విద్యార్థులకు ఉపాధిలో శిక్షణ

గుమ్మలక్ష్మీపురం : భద్రగిరి ఆర్ ఐటిఐలో చదువుతున్న సీనియర్ విద్యార్థులు నెల్లూరులో మూడు నెలలు ఉపాధి శిక్షణ పొందుతున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్‌కుమార్ తెలిపారు. వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్ విభాగాల్లో శిక్షణ కోసం పంపించినట్లు ఆయన చెప్పారు.

5న బృందా కరత్ బహిరంగ సభ

ప్రజాశక్తి-పాలకొండ

ఈనెల 5న పాలకొండలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ ఎన్నికల బహిరంగసభ జరగనుందని, కావున ఈ సభను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పాలకొండలో జరిగిన విలేకరుల సమావేశంలో తిరుపతిరావు మాట్లాడుతూ కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ, ఇండియా వేదిక పార్టీలు బలపర్చిన పాచిపెంట అప్పలనరస అరకు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సిపిఎం ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, అలాగే పాలకొండ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సవర చంటిబాబు పోటీ చేస్తున్నారని ఇరువుర్ని గెలిపించాలని కోరుతూ ఈ బహిరంగ సభ జరగనుందన్నారు. కావున ఈ బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు డి.రమణరావు, కె.రాము పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ నియోజకవర్గంలో పోలింగ్ విధులు నిర్వహించేందుకు వేరే నియోజకవర్గాల నుంచి వచ్చిన ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శుక్రవారం ఐటిడిఎ మీటింగ్ హాల్, బాలికల గురుకుల పాఠశాలలో పోలింగ్ విధులపై శిక్షణా కార్యక్రమంను నిర్వహించారు. వీరికి మాస్టర్ ట్రైనీలు, ఇవిఎం యంత్రాల పనితీరు, మాక్ పోలింగ్ చేసే విధానం, నివేదికలు సమర్పించే వివిధ ఫారాల గురించి శిక్షణ ఇచ్చారు. ప్రిసైడింగ్ అధికారులు అడిగినా వివిధ సందేహాలను మాస్టర్ ట్రైనీలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ జూన్ 29కు వాయిదా

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఈనెల 11న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం వాయిదా వేసినట్లు రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే11న రెండవ శనివారం, 13న సార్వత్రిక ఎన్నికలు, అధిక ఎండలు దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని వివరించారు. దీంతో ఈ కార్యక్రమాన్ని జూన్ 29నాటికి మార్చినట్లు తెలిపారు. కావున కక్షిదారులంతా గమనించి జూన్ 29న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లకు హాజరై తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎన్నికలకు కేవలం పది రోజుల సమయం మాత్రమే ఉండడంతో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశాయి. వైసిపి, టిడిపి, సిపిఎం అభ్యర్థులు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ, మద్దతు చూసి రానున్న ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని గట్టి నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. గెలిచాక అన్ని సమస్యలు పరిష్కరిస్తామని, అభివృద్ధి చేస్తామని ప్రజలకు హామీ ఇస్తున్నారు. ఒకవైపు వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజు వేడెక్కుతుంటే దానికి రెట్టింపు స్థాయిలో అభ్యర్థుల ప్రచార వేడి కనిపిస్తోంది. రానున్న ఎన్నికల్లో కురుపాంలో ప్రజలకు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాల్సిందే.

జీవాల పెంపకంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - సీతానగరం

జీవాల పెంపకాలపై అవగాహన సదస్సును స్థానిక పశు వైద్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి ఎస్.మన్మధరావు మాట్లాడుతూ వేసవిలో పశు పెంపకాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పశువులకు అందుబాటులో నీటి తొట్టెలను ఉంచాలన్నారు. కృత్రిమ గర్భోత్పత్తిని పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రైతు భరోసా కేంద్రాల్లో పశువులకు సంబంధించి అన్ని మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధ శాఖ అధికారులు కె.ప్రసాదరావు, మన్మధరావు, నీలయ్య, సిహెచ్ దీని కుమార్, సీతానగరం, బలిజిపేట మండలాల పశువైద్యాధికారులు ఎస్.రామారావు, సిహెచ్.గణేష్, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి మన్మధరావు

5న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటు హక్కు గల ఫారం-12 సమర్పించి ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు (పిఒ, ఎపిఒ, బిఎల్ఒ, ఇతర ఎన్నికల సిబ్బంది) స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఈనెల 5న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల మధ్యలో వారి ఓటు హక్కు వినియోగించు కోవచ్చని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.హేమలత తెలిపారు. ఓటరు కార్డు, ఏదైనా గుర్తింపు కార్డుతో పాటు ఎలక్షన్ ఆర్డర్‌తో హాజరై వారి పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాల్సిందిగా ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం, బాలగొడబలో శుక్రవారం రూరల్ సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రశాంతమైన ఓటింగ్కు ప్రజలంతా సహకరించి, శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై దినకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు : ఎఎస్పీ సునీల్ షారోన్ ఆధ్వర్యాన టౌన్, రూరల్ సర్కిల్ పోలీసులు మెయిన్ రోడ్‌లో మార్చ్ నిర్వహించారు. పోలింగ్ రోజున ఎలాంటి గొడవలు, ఘర్షణలు లేకుండా ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ సిఐ బాలకృష్ణ, ఎస్ఐలు కెవి సురేష్, సీతారాం, రమణ పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని అంటిపేట, చిన్నబోగిలి పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ కె.రవికుమార్ మాట్లాడుతూ ఈనెల 13న జరిగిన సాధారణ ఎన్నికల్లో గ్రామాల్లో ఎటువంటి జరగకుండా ఉండాలని ప్రజలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎం రాజేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

చంద్రబాబు వల్లే పింఛనుదారులకు కష్టాలు

వైసిపికి మరోసారి అవకాశం ఇవ్వాలన్న రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో సజావుగా సాగుతున్న వాలంటీర్ వ్యవస్థపై టిడిపి, జనసేన పార్టీలు ఫిర్యాదు చేయడం వల్లనే గత రెండు నెలలుగా పింఛను లబ్ధిదారులకు కష్టాలు మొదలయ్యాయని డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆరోపించారు. శుక్రవారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడచిన నాలుగున్నరేళ్లుగా ఇంటికి వెళ్లి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లను వాలంటీర్లు అందజేశారని చెప్పారు. నిస్వార్ధంగా ప్రజలకు సేవ చేస్తున్న వాలంటీర్లపై టిడిపి నాయకులు ఫిర్యాదు చేయడం వల్ల ఎన్నికల సంఘం వారిని విధులకు దూరంగా పెట్టిందని చెప్పారు. గత రెండు నెలలుగా పింఛను లబ్దిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందు లకు కారణం చంద్రబాబేనని అన్నారు. దీనిపై ఎల్లో మీడియా ఇష్టారాజ్యంగా తప్పుడు ప్రచారం చేస్తోందని, జగన్ మోహన్ రెడ్డి కారకుడనేలా టిడిపి మీడియా రాతలు రాస్తోందన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో పింఛను డబ్బులు అందుకోడానికి వెళ్లి వృద్ధులు, వికలాంగులు మరణించడానికి టిడిపి నాయకులే ప్రధాన కారణమని ఆరోపించారు. వాలంటీర్ వ్యవస్థపై మొదటి నుంచి అక్కసు వెళ్లగక్కుతున్న టిడిపి, జనసేన పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారని రాజన్నదొర అన్నారు.

మరో అవకాశం ఇవ్వాలి

మరోసారి తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర కోరారు. పట్టణంలోని 28,14 వార్డుల్లో ఆయన ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరిస్తానని చెప్పారు. రాష్ట్రంలో మరోసారి వైసిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. లేకపోతే పేదలే తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు కౌన్సిలర్లు బలభద్రుని శ్రీనివాసరావు,పాలవలస మధుసూదనరావు పాల్గొన్నారు.



పట్టణంలో ప్రచారం చేస్తున్న రాజన్నదొర

కురుకూటిలో...

మండలంలోని పెదబారి గాం, చిన బారిగాం గ్రామాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి వైసిపి ఎస్టీ సెల్ కన్వీనర్ కొండగొర్రి ఉదయ్ కుమార్‌తో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. గిరిజన సమస్యలు పరిష్కారం కావాలంటే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గొర్లె రాజారావు, సువార్తరావు ఎంపిటిసి సుబ్బారావు పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని పనసభద్ర పంచాయతీ పరిధిలోని గిరిశిఖర గ్రామాల్లో వైసిపి ప్రచారం చేపట్టింది. వైసిపి మండల నాయకులు ఎం.రంగు నాయుడు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. చిలకమండంగి, బాగుజోల, గుంట భద్ర, దుగ్గేరు, మూలవలస తదితర గ్రామాలలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి రాజన్నదొరను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలి

ప్రజాశక్తి - విజయనగరం కోట

ప్రజలందరూ విజ్ఞతతో ఆలోచించి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేసే చంద్రబాబుకు ఓటు వేయాలని విజయనగరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని 9వ డివిజన్ కోట్లమాదప్ప వీధి, కస్పా హైస్కూల్ వీధి, అయ్యకోనేరు గట్టు ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరించి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికలలో ఎన్‌డిఎ కూటమికి మద్దతు తెలిపి సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, కలిశెట్టి అప్పలనాయుడును ఎమ్‌పిగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మి, వరప్రసాద్, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, టిడిపి మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బీసీ నాయకులు వేచలపు శ్రీనివాసరావు, అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, గాడు అప్పారావు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలోకి 440 కుటుంబాలు చేరిక


విజయనగరంలో ప్రచారం చేస్తున్న అదితి గజపతిరాజు

పట్టణంలోని 37వ డివిజన్ వైసిపికి చెందిన నామన శ్రీనివాసరావు, రెడ్డిపల్లి అప్పలరాజు, పల్లంశెట్టి శ్రీనివాసరావుతో పాటు 40 కుటుంబాలు, 48వ డివిజన్‌కు చెందిన వైసిపి నాయకులు రాంబర్కి బుజ్జి, రాంబర్కి కృష్ణకు మారి, కొట్ల తాతారావు, నడిపల్లి సూరిబాబుతో పాటు 400 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారందరికీ అదితిగజపతి రాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

చీపురుపల్లి : రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛా జీవితాన్ని కోరుకుంటున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకట రావు అన్నారు. గరివిడిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావుతో కలసి ఆయన మాట్లాడారు. ముందుగా పత్రికా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కళావెంకటరావు రాష్ట్రంలో మీడియాతో పాటు ప్రజల గొంతు కూడా జగన్‌మోహన్‌రెడ్డి నొక్కుతున్నారని అన్నారు. అన్ని వర్గాలకు ఆమోద యోగ్యమైన అందరికీ అవసరమైన మెగా మేనిఫెస్టోని కూటమి ప్రకటించిందన్నారు. ఈ మేనిఫెస్టో ద్వారా ఎస్‌టి, ఎస్‌సి, మైనార్టీలతో పాటు బిసిలకు పెద్ద పీట వేశామన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు జవాబుదారీలుగా ఉండాలే గాని నియంతల్లా ఉండకూడదని జగన్‌ను విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమం అందరికీ అందించే సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు. ఓటు అనే ఆయుధంతో వైసిపిని బంగాళాఖాతంలో కలపాలని కోరారు. అనంతరం ఉమ్మడి మేనిఫెస్టోని ఆయన విడుదల చేశారు. సమావేశంలో జనసేన జిల్లా కన్వీనర్ కోట్ల కృష్ణ, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: మండలంలోని సిరిదేవిపురం గ్రామానికి చెందిన పలువురు వైసిపిని వీడి టిడిపిలో చేరినట్లు టిడిపి మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు తెలిపారు. శుక్రవారం చీపురుపల్లి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావు వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు.

సచివాలయానికి తాళం వేసిన సర్పంచ్

ప్రజాశక్తి - జియ్యమ్మవలస


సచివాలయానికి తాళం వేస్తున్న సర్పంచ్ చంటి

మండలంలోని అలమండ పంచాయతీ సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించక, విధులను సగ్గా నిర్వహించడంలేదని సర్పంచ్ ఊయక చంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవర్తన మార్చుకోవాలని, సమయ పాలన పాటించి సచివాలయానికి వస్తున్న అర్జీదారులకు సేవలు అందించాలని సిబ్బంది ఎన్నిసార్లు చెప్పినా స్పందించకపోవడం తో శుక్రవారం సచివాలయానికి తాళం వేసినట్లు తెలిపారు. అయితే వీరిలో పంచాయతీ కార్యదర్శి, ఎఎన్ఎం, మహిళా పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, సర్వేయింగ్ అసిస్టెంట్ మాత్రం తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా మిగిలిన సిబ్బందిపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.


వేపాడలో వీస్తున్న భారీ గాలులు

ఈదురుగాలుల బీభత్సం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో శుక్రవారం మధ్యాహ్నం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు సంభవించి, వడగళ్ల వాన కురిసింది. దీంతో చేతికి వచ్చిన మామిడి, జామ, నిమ్మకాయలు నేలపాలయ్యాయి. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ ఏడాది అంతంత మాత్రంగా ఉన్న మామిడి పంటకు ఈదురుగాలుల వల్ల కాయలు నేలరాలడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మామిడికాయలపై వడగండ్లు పడడం వల్ల మచ్చలు తేలి భారీగా నష్టం వాటిల్లుతుందని గగ్గోలు పెడుతున్నారు.

జాతీయ విద్యా విధానంపై చర్చా గోష్టి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం లో శుక్రవారం జాతీయ విద్యావిధానం ఆచరించదగిన అంశాలపై చర్చా ఘోష్టి జరిగింది. ముఖ్యఅతిధిగా విచ్చేసిన భారతీయ శిక్షన్ మండల్ జాతీయ కార్యదర్శి బిఆర్ శంకరానంద మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంలో ఉపయుక్తమైన అంశాలు, దాని ఆధారంగా విద్యా వ్యవస్థలో తీసుకు రావలసిన మౌలికమైన మార్పులను చర్చించారు. ట్రైబల్ స్టడీస్ విభాగాధిపతి డా.అనిరుద్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో డీన్ ఆచార్య జితేంద్ర మోహన్‌మిశ్రా, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పోలింగ్ ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల కమిషన్ సమీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

భారత ఎన్నికల కమిషన్ శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. జిల్లాలో పోలింగ్ ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. ఎస్‌పి విక్రాంత్‌పాటిల్, పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులుగా ప్రమోద్ కుమార్ మెహర్ద, పార్లమెంటరీ నియోజకవర్గ పోలీసు పరిశీలకులు నయీం ముస్తఫా మన్సూరి, నాలుగు శాసనసభ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు రమాకాంత్ ప్రధాన్, పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు గుర్ కరణ్ సింగ్, శాసన సభ నియోజక వర్గాల వ్యయ పరిశీలకులు రమాకాంత్ ప్రధాన్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్, ఎస్‌పి

సమస్యలపై పోరాడే సిపిఎంను గెలిపించండి

ప్రజాశక్తి-మెంటాడ

అరకు పార్లమెంట్ అభ్యర్థి అప్పలనర్స


ఆంద్రలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం అభ్యర్థి అప్పలనర్స

గిరిజనులు, దళితుల సమస్యలపై పోరాడేది సిపిఎం మాత్రమేనని, అందువల్ల ఇండియా వేదిక మద్దతుతో పోటీ చేస్తున్న తనను గెలిపించాలని అరకు పార్లమెంట్‌స్థానం సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స కోరారు. శుక్రవారం మండలంలోని ఆంద్రలో ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో వైసిపి పాలనలో ధరలు పెరిగాయని, ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు తగ్గాయని అన్నారు. యువత గంజాయి మత్తుకు అలవాటు పడిపోయి ప్రమాదపు కోరల్లో చిక్కుకుంటున్నారని అన్నారు. వామపక్షాలు పోరాడి సాధించుకున్న ఉపాధిహామీ చట్టాన్ని బిజెపి,వైసిపి ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని అన్నారు. 200 రోజులు పని ఇమ్మంటే ఇవ్వడం లేదని, పనుల వద్ద కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని అన్నారు. వామపక్షాలు అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంలో రోజు కూలి రూ.739 ఇస్తుంటే ఇక్కడ మాత్రం రెండుపూటల పనులు పెట్టి అందుకు తగ్గ వేతనం ఇవ్వడం లేదని అన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి బిజెపి ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులను కేటాయించడం లేదన్నారు. ప్రజల మధ్య మతం, కులం పేరిట చిచ్చుపెట్టి పబ్బం గడుపుకునేందుకు ప్రయతిస్తోందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మన హక్కుల సాధన కోసం, సమస్యల పరిష్కారానికి పార్లమెంట్‌లో మనం గళం వినిపించాలని, అందుకోసం సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్, నాయకులు రాకోటి రాములు, ఆనంద్, హరి కృష్ణవేణి, సిహెచ్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వాణిజ, గుర్ల, కొండలింగాలవలస, ఆగూరు గ్రామాల్లో ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు.

రేపటి నుంచి పోస్టల్ బ్యాలెట్ వినియోగం

ప్రజాశక్తి- విజయనగరం కోట

కలెక్టర్ నాగలక్ష్మి

పోస్టల్ బ్యాలెట్ కోసం ఇప్పటికే ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు (ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న వారు) తమ ఓటు హక్కును ఈ నెల 5 నుంచి 7 వ తేది మధ్య వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. దీనికోసం అన్ని నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ మూడు రోజుల్లో ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఓటు వేయవచ్చునని సూచించారు. జిల్లాలోని పని చేస్తూ, ఇతర జిల్లాలో ఓటు హక్కు కలిగిఉండి, పోస్టల్ ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నవారు, తమ ఓటు హక్కును వినియోగించు కోడానికి, విజయనగరంలోని జెఎన్‌టియులో ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అకడమిక్ బ్లాక్-1 గ్రౌండ్ ఫ్లోర్ లోని 1,2,3,4,5 గదుల్లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. విజయనగరం నియోజకవర్గంలో ఓటు కల్గిన ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవడానికి కూడా జెఎన్‌టియులోని అకడమిక్ బ్లాక్-2లో ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. పోస్టల్ ఓట్ల కోసం దరఖాస్తు చేసుకున్న తమ సిబ్బంది అందరికీ ఫెసిలిటేషన్ సెంటర్ల వివరాలను, జిల్లా అధికారులు తెలియజేయాలని కలెక్టర్ కోరారు. పోస్టల్ ఓటు విషయంలో ఏమైనా సందేహాలు ఉన్నవారు, కలెక్టరేట్లోని హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని సూచించారు.



పేదలకు అన్నదానం చేస్తున్న అయ్యలు

ఘనంగా అయ్యలు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

జనసేన నాయకులు గురాన అయ్యలు జన్మదిన వేడుకలను జనసేన నాయకులు, అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెలుగు ఆశ్రమం, పినవేమలి ఎబిసిడి ఆశ్రమాల్లో అన్నదానం చేశారు. పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం జీఎస్ఆర్ హోటల్లో అభిమానులు సమక్షంలో బర్త్‌డే కేక్‌ను కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. జిల్లాలోని జనసేన నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలతో అయ్యలుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మీడియాతో మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను స్ఫూర్తిగా తీసుకుని తన జన్మదినం రోజున అభిమానులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో జనసేన బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

నిర్భయంగా ఓటు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-వంగర

ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు ఐఎఎస్ అధికారి తంత్ పర్వేజ్ ఇక్బాల్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని లక్షింపేటలో పర్యటించారు. పలు వీధు ల్లోకి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిం చారు. ప్రతి ఒక్కరు కూడా తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకో వాలని అన్నారు. పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలపై రెవెన్యూ అధికారులకు సూచ నలు ఇచ్చారు. కార్యక్రమంలో రాజాం రూరల్ సిఐ ఎస్.శ్రీనివాస్, తహశీల్దార్ చిరంజీవి పడాల్, వంగర ఎస్ఐ వై జనార్ధన్ పాల్గొన్నారు.